ఈనాడు
వికారాబాద్

గురువారం 31 ఆగస్టు 2017 | 16 పేజీలు

ఆయకట్టుకు కటకట!

- 1,158 చెరువులకు నిండినవి 41
- సేద్యమంతా బోరుబావులపైనే ఆధారం



అరకొర నీటితో ఉన్న గంగ్వార్ ఊర చెరువు

వర్షాకాలం మరో నెల రోజులు మాత్రమే మిగిలింది. ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో నామమాత్రంగానే నీరు చేరింది. ఇప్పటివరకు అడపాదడపా కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా కొన్ని చెరువుల్లో 25 శాతం మాత్రమే నీరు చేరింది. దీంతో ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చెరువు నీటిపై భరోసాను వదులుకొని బోరుబావులపైనే ఆధారపడి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా పునరుద్ధరణ చేపట్టడంతో చాలా వరకు చెరువులు బాగుపడుతున్నాయి. పాటు కాలువలు బాగు చేయడంతో పాటు పూడిక తీయడంతో ఎక్కువశాతం నీటి నిలువ సామర్థ్యం పెరిగింది. అయితే ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు కళ తప్పాయి. ఇవీ వివరాలు...

న్యూస్‌టుడే, బషీరాబాద్

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,158 చెరువులు ఉండగా, ప్రస్తుతం 41 చెరువులు మాత్రమే వంద శాతం నిండాయి. 824 చెరువుల్లో 25శాతం, 205 చెరువుల్లో 50శాతం, 88 చెరువుల్లో 75 శాతం మాత్రమే నీరు చేరినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి భూగర్భ జలమట్టం 12.50 మీటర్ల లోతులో ఉంది. ఇప్పటివరకు తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలో అడపాదడపా వర్షాలు కురుస్తుండగా... కొడంగల్, పరిగి నియోజకవర్గాలోని మండలాల్లో పరిస్థితి దారుణంగా మారింది. కొడంగల్‌లో 213 చెరువులకు ఒక్క చెరువులో కూడా సగమైనా నీరు చేరలేదు. పరిగి నియోజకవర్గంలోని 385 చెరువుల్లో రెండు చెరువుల్లో మాత్రమే 50 శాతం నీరు చేరగా, మిగిలిన వాటిల్లో తూముకు అందేలాగైనా జలం రాలేదు. దీంతో రెండు నియోజకవర్గాల్లో రైతులు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీరు చేరేవిధంగా భారీ వర్షాలు కురియడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. చినుకు చినుకు వర్షాలకు కేవలం కంది, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు మాత్రమే మేలు జరుగుతోందని, నీటి ఆధార పంటలకు ఈఏడాది ఇబ్బందిగానే ఉందంటున్నారు. భారీ వర్షాలు లేనందున



బోరుమోటారు కింద వరి సాగు

మిగతా 7 లో...

జనవరి కల్లా ఇంటింటికీ నల్లా నీళ్లు



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో వికారాబాద్ ఎమ్మెల్యే సంజీవరావు, పాలనాధికారిణి దివ్య

మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పనులు ముమ్మరం చేసి, వచ్చే ఏడాది జనవరి కల్లా జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని ఇంటింటికీ నల్లా నీళ్ల అందించనున్నామని మంత్రి మహేందర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈమేరకు బుధవారం వికారాబాద్‌లోని జిల్లా పరిపాలనా కార్యాలయంలోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకంలో భాగంగా రూ.రెండు వేల కోట్లతో పనులు చేపడుతున్నామని, ఇప్పటివరకు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. గడువులోగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు వీలుగా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై పర్యవేక్షిస్తున్నారని, ఆయా నియోజకవర్గాలకు చెందిన శాసన సభ్యులు బాధ్యత తీసుకోవాలని, అధికారులు సైతం ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాము సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా పాలనాధికారిణి దివ్య మాట్లాడుతూ... మిషన్ భగీరథ పనులు చేపడుతున్న క్రమంలో ఆర్అండ్‌బీ రహదారులకు, విద్యుత్తు, టెలీకమ్యూనికేషన్ పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామన్నారు. సమీక్షలో వికారాబాద్ ఎమ్మెల్యే సంజీవరావు, డీఆర్ఓ సంధ్యారాణి, నీటిపారుదల శాఖ ఎస్ఈ ఆంజనేయులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'అభయ'మివ్వని 'హస్తం'... అంతా అయోమయం! 3

పరిశుభ్రతకు ప్రోత్సాహం... ప్రతిభకు పట్టం! 9

'అనుసంధానం'.. అధ్వానం! 16

ఊరూవాడా టేకు జపం

- డిమాండ్‌ను గుర్తించిన పాలనాధికారిణి
- అసోం నుంచి 18 లక్షల కాండాల దిగుమతి
- నేటి నుంచే పంపిణీ షురూ



అసోం నుంచి వచ్చిన టేకు కాండాలు

న్యూస్‌టుడే, పరిగి

రాష్ట్రాన్ని పచ్చదనానికి చిరునామాగా మార్చేందుకు ప్రభుత్వం హరితహారాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రస్తుతం మూడో విడత కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెంటాడుతుండటంతో ప్రజల నుంచి ఆశించిన మేరకు స్పందన రావడంలేదు. ఎలాగైనా విజయవంతం చేయాలనే పట్టుదలతో జిల్లా పాలనాధికారిణి దివ్య స్వయంగా దృష్టి సారించారు. అయినా ఆశించిన మేరకు ఫలితాలు రావడంలేదు. ఎందుకిలా జరుగుతోందంటూ కారణాలను అన్వేషించారు. విపణిలో వాణిజ్యపరంగా టేకుకు ఉన్న ఆదరణ అంతా ఇంతాకాదు. ఎక్కువ మంది వీటిపైనే ఆసక్తి చూపుతున్నారు. అధికారులు మాత్రం వీటికి బదులుగా 20 రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఇవి నిరాదరణకు గురవుతున్న విషయాన్ని పసిగట్టిన పాలనాధికారిణి టేకు మొక్కలను సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈక్రమంలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని అన్నదాతలకు మొత్తంగా 18 లక్షల వేర్లు అందజేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం సుమారు కోటి రూపాయలను వెచ్చిస్తున్నారు. తొలిదశలో భాగంగా ప్రస్తుతానికి అసోం నుంచి అయిదు లక్షల వేర్లు, కాండాలు తెప్పించారు. మండల వ్యవసాయాధికారుల ద్వారా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. మూడో విడత హరితహారంలో జిల్లాలో 1.25 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంగా ఉండగా వివిధ కారణాలతో ఇప్పటివరకు 47 లక్షలు మాత్రమే నాటగలిగారు. కనీసం యాభై శాతం కూడా పూర్తి కాలేదు. గత వారం రోజులుగా

మిగతా 7 లో...

ప్రమాదకరంగా చెరువుకట్ట


చెరువుకట్టపై నిలిచిన వర్షపు నీరు

దౌల్తాబాద్, న్యూస్ టుడే: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకట్ట మరమ్మతులలో భాగంగా కట్ట ఎత్తును పెంచి కట్టపై మట్టి పోయడంతో కట్టపై గోతులు ఏర్పడ్డాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి వర్షపు నీరు కట్టపై ఏర్పడిన గుంతలలో నిలిచి ప్రమాదభరితంగా మారిందన్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలువడంతో నూతనంగా వచ్చే వాహన చోదకులకు గుంతలు కనపడక పలుసార్లు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. భారీ వర్షం కురిస్తే కట్ట కోసుకుపోయే ప్రమాదముందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి కట్టకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బోర్డులు కనిపించవు.. బాధలు వినిపించవు!

☛ ప్రైవేటుపైనే ఆధారపడుతున్న ప్రయాణికులు ☛ ఆదాయాన్ని కోల్పోతున్న ఆర్టీసీ

న్యూస్‌టుడే, పరిగి

ఆర్టీసీ లాభాల బాట పడుతుందని మంత్రులూ, అధికారులు తరచూ ప్రకటిస్తున్నా జిల్లాలో పలుచోట్ల బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు నిత్యం పాట్లు పడుతున్నారు. చాలా కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. తికమక బోర్డులతో, సమయానికి ప్రాంగణానికి రాక ఆదాయాన్ని చేజేతులా కోల్పోవాల్సి వస్తోంది. నష్టాల ఊబిలోంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న డిపోను గాడిన పెట్టే కార్యక్రమాలకు అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రైవేట్ వాహనాల పోటీతో సంస్థకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి సమయంలో ఆ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నించాలి. కానీ అలాంటి ప్రయత్నాలేవీ జరగడంలేదని వాస్తవాలను పరిశీలిస్తే తెలుస్తుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి న్యూస్‌టుడే అందిస్తున్న కథనం.

తరచూ వివాదాలు

జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్‌లలో బస్ డిపోలున్నాయి. వీటికి హైదరాబాద్ నుంచి నిత్యం వేలాదిమంది వస్తూ పోతుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వారి సంఖ్య నిత్యం వందల్లో ఉంటుంది. బస్సు ఒక రూట్లో వెళ్తే బోర్డులు మాత్రం మరో రూట్‌కు సంబంధించినవి ఉంటున్నాయి. విషయం తెలియని ప్రయాణికులు ఎప్పటిమాదిరిగానే బస్సు ఎక్కడం కొద్ది దూరం వెళ్లాక ఆ రూట్లో వెళ్లడం లేదని చెప్పడంతో డ్రైవర్లకు, ప్రయాణికులకు మధ్య వివాదాలు చోటుచేసుకోవడం తరచూ జరుగుతున్నాయి. పరిగిలో స్థానికంగా డిపో ఉన్నప్పటికీ ప్రయాణికుల సమస్యలు మాత్రం దశాబ్దాలుగా సమసి పోవడం లేదు. పరిగి నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా సీట్లు దొరకక రెండున్నర గంటల పాటు నిలబడి ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. పరిగి డిపోలో దాదాపు 84 బస్సులు ఉండగా వాటిలో 20కి పైగా అద్దె బస్సులు ఉన్నాయి. ఇవి నిత్యం 33వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ సుమారు 60వేల మంది ప్రయాణికులను తమతమ గమ్యస్థానాలకు తరలిస్తున్నాయి. సగటున రోజుకు రూ. 7.5లక్షల నుంచి రూ. 8లక్షల ఆదాయం వస్తోంది. స్టేజీల వద్ద ఆపడం, ప్రయాణికులతో కలుపుగోలుగా మాట్లాడం వంటివి బాగానే ఉన్నా బోర్డుల విషయంలో మాత్రం


పూర్తి అక్షరాలు కనిపించని బోర్డు


చెదిరిన అక్షరాలు, పగిలిన అద్దం

సమస్యలు నిత్యకృత్యంగా మారాయి. వీటిపై దృష్టి సారిస్తే చాలా వరకు సమస్యలు తీరతాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

కొన్ని నిదర్శనాలు

★ ఒక గ్రామానికి వెళ్లాల్సిన బస్సు అది ఏ గ్రామం మీదుగా వెళ్తుందో స్పష్టంగా రాయడం లేదు. ఒకవేళ రాసినా ఆ రూట్లో ఆ బస్సు ప్రయాణించడం లేదు.

★ బస్సుల్లో వేస్తున్న బోర్డులు కూడా సరిగ్గా కనిపించడం లేదు.

★ ప్రధానంగా మహబూబ్‌నగర్ రూట్లో వెళ్తున్న బస్సుల సమయపాలన అన్నది అస్తవ్యస్తంగా మారింది.

★ ఉదయం ఆరు నుంచి 8 గంటల సమయంలో అనేక బస్సులు బయల్దేరుతాయి. కానీ వీటికి బోర్డులు మాత్రం సరిగా వేయడం లేదు.

★ ప్లాట్‌ఫాం మీద బస్సులు ఉంటున్నా చాలాసేపు నిరీక్షించాల్సి వస్తోంది.

★ ఒకేసారి నాలుగైదు బస్సులు ఒకదాని వెంబడి మరోటి వెళ్తున్నాయి. ఈ కారణంగానూ ఆదాయం దెబ్బతింటోంది.

★ పరిగి నుంచి షాద్‌నగర్, హైదరాబాద్, కుల్కచర్ల, కోడంగల్, వికారాబాద్ రూట్లలో అనేక ప్రైవేట్ వాహనాలు తిరుగుతున్నాయి. బస్సులు బయల్దేరే సమయానికి ఐదు పది నిమిషాలు ముందుగా వెళ్లడంతో చాలా సార్లు బస్సులు ఖాళీగా వెళ్తున్నాయి. దీంతో రోజుకు సుమారు రెండు లక్షల మేరకు ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. చిన్న చిన్న సమస్యలను అధిగమిస్తే ప్రయాణికుల ఆదరణ మరింత పెరిగే అవకాశముందని ప్రయాణికులు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు స్థానికులు తెలిపారు.


బస్సు ఎటు వెళ్తుందని కండక్టరును అడుగుతున్న ప్రయాణికులు

షెల్టర్లు మరమ్మతు చేస్తే..

అనేక గ్రామాల వద్ద బస్ షెల్టర్లు కొరవడ్డాయి. అసలే వర్షాకాలం కావడంతో కనీసం తలదాచుకునేందుకు ఆస్కారమే లేదు. ఆదాయార్జనపైనే దృష్టి సారించిన ఆర్టీసీ వసతుల కల్పన గురించి పట్టించుకోవడం లేదు. బొంపల్లి, రంగాపూర్, అంగడిచిట్టెంపల్లి, తొండపల్లి తదితర గ్రామాల్లో గతంలో ఉన్న షెల్టర్లు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకటీ రెండు చోట్ల ఉన్నా వాటి ఆలనా పాలన లేకుండా పోయింది. షెల్టర్లలో కనీసం టీ స్టాల్ ఉన్నా బస్సు వచ్చే వరకు నిలబడే అవకాశముంటుంది. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డివిజన్‌లోని మిట్టకోడూరు, ఖుదావంద్‌పూర్, చిట్యాల్, లఖ్నాపూర్, తొండపల్లి, పూడూరు, దోమ, గొడుగానిపల్లి, రాకంచర్ల తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్త బోర్డులు రాయిస్తున్నాం


-మోహన్‌రావు, డీఎం

ఇప్పటికే చాలా వరకు బోర్డులు కొత్తవి రాయిస్తున్నాం. ప్రయాణికులు తికమకపడకుండా ఉండేందుకు ఏ బస్సు ఏ రూట్లో వెళ్తుందో స్పష్టంగా తెలిపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. సమయానుకూలంగా బస్సులు నడిపేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం.

గ్రంథాలయం... కూలేందుకు సిద్ధం!

భారీ వర్షం పడితే ఇంక అంతే...


కూలిన గ్రంథాలయ పైకప్పు


శిథిల దశలో భవనం

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ భవనం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దయింది. గత జూన్‌లో కురిసిన వర్షాలకు గ్రంథాలయ భవనం ఓ భాగం కూలిపడింది. అయినా సంబంధిత శాఖ అధికారుల్లో చలనం రాలేదు. అలాగే వదిలేశారు. మంగళవారం కురిసిన వర్షాలకు గది పైకప్పు పూర్తిగా కూలిపడింది. ప్రధాన భవనంలోకి వర్షపు నీరు చేరి పాఠకులు చదువుకోవడానికి తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. భవనం పురాతనమైనది కావడంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీరంతా భవనంలోకి చేరుతోందని పలువురు పాఠకులు ఈ సందర్భంగా అన్నారు. భవనం పైపెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయని వారు వాపోతున్నారు. గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాఠశాల ఆవరణలో ఉన్న గ్రామ పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని పలుసార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. వర్షానికి నానిన పైకప్పు విద్యార్థులు ఉన్న సమయంలో కూలిపడితే ప్రమాదం సంభవించే అవకాశముందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని ఇక్కడి నుంచి ఇతర భవనంలోకి మార్చాలని, కొత్త భవనం నిర్మించాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు.

అభయమివ్వని హస్తం... అంతా అయోమయం!

- 11 నెలలుగా పింఛను కోసం ఎదురుచూపులు
- మూడేళ్లుగా అందని ఉపకార వేతనాలు


న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

● బొంరాస్‌పేట మండలంలోని మదన్‌పల్లికి చెందిన నర్సమ్మకు అభయహస్తం పథకం కింద పింఛను వస్తుంది. ఆ కొద్ది మొత్తంతోనే చిన్నచిన్న ఖర్చులు తీర్చుకుంటుంది. మనవళ్లు అడిగితే రూపాయి ఇస్తుంది. 11 నెలలుగా కొద్దిపాటి మొత్తంకూడా రాకపోవటంతో ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తుంది.

● యాలాల మండలం ముద్దాయిపేటకు చెందిన వెంకటమ్మ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉండగా అభయహస్తంలో చేరారు. అర్హతను బట్టి నెలకు రూ.500 పింఛను వస్తోంది. చాలా కాలంనుంచి ఆగిపోవటంతో డబ్బులు ఎప్పుడొస్తాయని తెలిసిన వారిని అడుగుతోంది. అభయమివ్వాల్సిన హస్తం పనితీరు ఎలా ఉందనడానికి ఇవి చిన్న ఉదాహరణలు మాత్రమే. పథకం నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ పరిస్థితులపై న్యూస్‌టుడే అందిస్తున్న కథనం.

ఆర్థిక భరోసా లక్ష్యం...

గ్రామీణ ప్రాంతాల పొదుపు సంఘాల సభ్యులు రోజుకు రూపాయి పొదుపు చేసే విధంగా తద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో 2009లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'అభయ హస్తం' పథకం తీసుకొచ్చింది. దీనికింద పిల్లల చదువులకు ఉపకార వేతనాలు, వృద్ధాప్యంలో పింఛనుతో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.30వేలు ఆర్థికసాయం అందజేస్తారు. అందులో తక్షణసాయంగా అంత్యక్రియలకు రూ.5వేలు అందజేస్తారు. ప్రయోజనాలు బాగుండటంతో ఈ పథకంలో చేరటానికి నెలకు రూ.30, ఏడాదికి రూ.365 చెల్లించి సభ్యులుగా చేరారు. అయితే 2014-15 నుంచి రాష్ట్ర ప్రభుత్వమే సభ్యురాలి వాటాధనం చెల్లిస్తూ సభ్యత్వాలను పునరుద్ధరిస్తోంది. గతేడాది మార్చి 31తో గడువు పూర్తికాగా 2017-18 ఏప్రిల్ నుంచి పథకం అమల్లో లేకుండా పోయింది. పథకంలో సభ్యురాలిగా చేరితే బీమా సదుపాయాలు కల్పించాలి. పిల్లల చదువులకు 8వ తరగతినుంచి ఇంటర్ వరకు ఉపకార వేతనాలు అందించాలి. మృతి చెందిన కుటుంబాలకు బీమా సదుపాయాలతో పాటుగా వికలత్వం చెందినా బీమా అందించాఇల. పథకం పునరుద్ధరణ ఆగిపోవటంతో ఐదు నెలలుగా మృతిచెందిన సభ్యులకు బీమా అందటంలేదని ఆందోళన చెందుతున్నారు.



అభయహస్తం పథకం లోగో


ముఖ్య కార్య నిర్వాహణాధికారి
గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్)

లబ్ధిదారులకు అందజేసిన బీమా బాండు పత్రం

గత సెప్టెంబరు తర్వాత రాలేదు...

అభయహస్తంలో సభ్యురాలిగా చేరితే 60 ఏళ్ల వయస్సు పూర్తయిన సభ్యురాలికి నెలకు రూ.500 చొప్పున పింఛను అందించాలి. జిల్లాలో 1,213 మంది లబ్ధిదారులు అభయహస్తం కింద ఉన్నారు. వీరికి గతేడాది సెప్టెంబరు వరకు లబ్ధిదారులకు డబ్బులు చెల్లించారు. అక్టోబరు నుంచి ఈ నెల (ఆగస్టు) వరకు 11 నెలల పింఛను బకాయిలు పడ్డాయని వాటికోసం ప్రతిరోజూ ఎదురు చూడాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. 60 ఏళ్ల వయస్సు పూర్తయిన వారికి ఐదేళ్లపాటు పింఛను అందిస్తూ 65ఏళ్ల నుంచి ప్రభుత్వం అందించే 'ఆసరా' పథకంలో చేరుస్తున్నారని కొందరు లబ్ధిదారులు తెలిపారు. .

మూడేళ్లుగా అందని ఉపకార వేతనాలు

అభయహస్తం పథకంలో సభ్యులుగా చేరితే 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు తమ పిల్లల చదువులకు నెలకు వంద రూపాయల చొప్పున ఉపకార వేతనాలు అందించాలి. మూడేళ్లుగా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఐకేపీ సిబ్బందిని నిలదీస్తున్నారు. అర్హులైన విద్యార్థుల రెండేళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా 2016-17 వివరాలు నమోదు చేయాల్సి ఉందని ఐకేపీ సిబ్బంది అంటున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 10,762 మంది ఉపకార వేతనాలు పొందటానికి అర్హులైన విద్యార్థులు ఉండగా ఏడాదికి రూ.1,29,14,400 చెల్లించాల్సి ఉంటుంది.

ఎప్పటికప్పుడే వివరాలు ఇస్తున్నాం

– వెంకటాచారి, ఐకేపీ ఏపీఎం బొంరాస్‌పేట

మూడేళ్లుగా అభయహస్తం పాలసీలను ప్రభుత్వమే పునరుద్ధరిస్తోంది. సభ్యుల వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు అందిస్తున్నాం. ఈఏడాది ఇంకా పునరుద్ధ రణ చేయలేదు. మూడేళ్ల ఉపకార వేతనాలు బకాయి ఉండగా రెండేళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. 11 నెలల పింఛను రావాల్సి ఉంది.

మండలం	పథకంలోని సభ్యులు	పింఛను పొందుతున్నవారు
1) బంట్వారం	213	9
2) బషీరాబాద్	548	58
3) బొంరాస్‌పేట	325	61
4) ధారూర్	141	33
5) దోమ	98	95
6) దౌల్తాబాద్	293	53
7) కోటపల్లి		72
8) కొడంగల్	417	79
9) కుల్కచర్ల	568	54
10) మర్పల్లి	393	59
11) మోమిన్‌పేట	215	65
12) నవాబ్‌పేట	333	132
13) పరిగి	259	72
14) పెద్దేముల్	433	86
15) పూడూరు	288	94
16) తాండూరు	535	46
17) వికారాబాద్	156	100
18) యాలాల	193	45


ఎప్పుడూ ఎదురుచూపులే..

– మహబూబ్ బీ, పింఛను లబ్ధిదారు, నాగిరెడ్డిపల్లి (బొంరాస్‌పేట)



మేము కట్టిన డబ్బులతోనే పింఛను ఇస్తున్నారు. అవి కూడా ఇవ్వటానికి నెలల తరబడి ఎదురు చూపులు తప్పటంలేదు. ప్రభుత్వం సాయం చేయకున్నా మా డబ్బులకు అధికారులను అడుక్కోవటం, ఎదురుచూటడం బాధగా ఉంటోంది. అధికారులు ఆసరా లబ్ధిదారులతోపాటుగా ప్రతినెల రూ.500 అందిస్తే బాగుంటుంది.

దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి


మాట్లాడుతున్న తెరాస పొలిట్ బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

కుల్కచర్ల గ్రామీణ: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని తెరాస పొలిట్ బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండ దేవాలయం దగ్గర ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాంబండ దేవాలయానికి ఎన్నో ఏళ్ళ చరిత్ర ఉందని ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. అంతేకాకుండా ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉండేందుకు దేవాలయం దగ్గర కల్యాణ మండపం అవసరం ఉందని తెలిపారు. ఇందుకు 25 లక్షల రూపాయలతో త్వరలో కల్యాణ మండప నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. అంతారం దగ్గర నిర్మించబోయే రిజర్వాయర్‌కు పాంబండ దేవాలయం పేరున శ్రీరామలింగేశ్వర రిజర్వాయర్‌ను అనే పేరును పెట్టాలని ముఖ్యమంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. తెరాస ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని వివరించారు. నియమితులైన సభ్యులు దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఆలయ ఛైర్మన్‌గా ఎన్నికైన బాల్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని ఛైర్మన్ అన్నారు. హరీశ్వర్‌రెడ్డి తనయుడు అనిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసి మనోహర్‌రెడ్డి, విపణి ఛైర్మన్‌లు ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రామలింగం, ఏవో స్నేహలత, ఎంపిటీసీలు రాములు, క్రిష్ణయ్యగౌడ్, తెరాస నాయకులు రాజప్ప, నాగరాజు, అర్చకులు దశరథం, పాండు పాల్గొన్నారు.

బాలుడిని వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు


బాలుడితో పోలీసు, శిశుగృహ ఉద్యోగి

తాండూరు: ఎక్కడి నుంచో తీసుకువచ్చి అయిదేళ్ల బాలుడిని బస్‌స్టేషన్‌లో వదలివెళ్లిన సంఘటన తాండూరులో జరిగింది. తాండూరు శిశుగృహ ప్రతినిధి నరేష్ తెలిపిన ప్రకారం.. కృష్ణ(5) అనే బాలుడు తాండూరు బస్‌స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ తిరుగుతుండగా, గమనించిన ఓ వ్యక్తి బాలుడిని చేరదీసి ఊరు, పేరు, తల్లిదండ్రుల వివరాలు అడిగారు. తన పేరు కృష్ణ అని, తల్లి సరిత, తండ్రి రవి, ఊరు నాంపల్లి అని వివరించాడు. ఏ జిల్లా, నాంపల్లిలో ఎక్కడ ఉంటావని అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దీంతో చేసేది లేక ఆ వ్యక్తి బాలుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి జేబులో ఉత్తరం లభించింది.. అందులో బాలుడిని అనాథ ఆశ్రమంలో లేదా హాస్టల్‌లో చేర్పించి పుణ్యం చేసుకోవాలని కోరుతూ రాశారు. అయితే బస్‌స్టేషన్‌లో ఎవరు వదిలి వెళ్లారనే విషయంలో బాలుడి నుంచి సరైన సమాధానం రాలేదు. బాలుడిని పోలీసులు చేరదీసి, శిశుగృహకు అప్పగించారు.

పరిగి

నేడు కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోస్గి, న్యూస్‌టుడే: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 31న కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం మండల అధ్యక్షులు వెంకట్రాములు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం కూడా తెలంగాణ ప్రాంతం రజాకార్ల ఆధీనంలో కొనసాగిందని, అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ కలగజేసుకొని సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి కలిగించారన్నారు. ఈ అంశంపై కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు మొదటి బహుమతిగా రూ. రెండువేలు, ద్వితీయ బహుమతిగా రూ. వెయ్యి, మూడవ బహుమతిగా రూ. అయిదు వందల నగదు అందిస్తున్నామన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న ప్రజా ప్రతినిధులు

మాజీ నేతల సేవలను వినియోగించుకోండి

మోత్కూర్ (దోమ): మాజీ సర్పంచులు, ఎంపీటీసీల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం దోమ మండలం మోత్కూర్‌లో మాజీ ప్రజా ప్రతినిధుల డిమాండ్లు తీర్చాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ప్రజాప్రతినిధులకు నెలకు 3 నుంచి 6 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

పక్కాగా ప్రభుత్వ కార్యక్రమాల అమలు


కుల్కచర్లలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి


దోమలో మాట్లాడుతున్న సీఐ


పరిగి: వేర్లు పరిశీలిస్తున్న ఏడీ నగేష్‌కుమార్, ఏఓ

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని మండల ప్రత్యేకాధికారి వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కుల్కచర్ల మండల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. నిబంధనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు పోవలసిన అవసరం ఉందని చెప్పారు.

గీత కార్మికులు ఈత మొక్కలు నాటాలి

దోమ,న్యూస్‌టుడే: గీత కార్మికులు ఈత మొక్కలు విరివిగా నాటాలని ఆబ్కారీ శాఖ సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం దోమ మండల పరిషత్ కార్యాలయంలో గీత కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులవృత్తికి ఈత చెట్లు పెంచుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి సంఘం తరపున 2వేల మొక్కలు తప్పక నాటాలని సూచించారు. దీంతో హరిత హారం లక్ష్యం నెరవేరుతుంది. ఇటు ఉపాధికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఇందుకు గీత కార్మికులు అంగీకరించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపీడీఓ హరినాథ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మల్లేశం, మొగులయ్యపాల్గొన్నారు.

నేటి నుంచి టేకు వేర్ల పంపిణీ

పరిగి, న్యూస్‌టుడే: రైతులకు నేటి నుంచి టేకు దుంగలను సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు నగేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి గంగాధర్ తెలిపారు. పరిగి డివిజన్‌లోని పూడూరు, పరిగి, దోమ, కుల్కచర్ల మండలాలకు గాను 1.2లక్షల టేకు వేర్లు వచ్చాయని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్ జిరాక్సు ప్రతులతో వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం


అమర్‌నాథ్


రాఘవేందర్‌రెడ్డి

పూడూరు: పీఆర్టీయూ పూడూరు మండల శాఖ నూతన కార్యకర్గం ఎంపికైంది. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాకంచర్లలో జరిగిన సమావేశంలో పరిగి, కుల్కచర్ల, దోమ మండలాలకు చెందిన సంఘం నాయకులు బ్యాలెట్ ద్వారా ఎన్నికలను నిర్వహించారు. ఇందులో అధ్యక్షులుగా అమర్‌నాథ్ (కంకల్) ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌రెడ్డి(అంగడిచిట్టంపల్లి) అసోసియేట్ అధ్యక్షులుగా అంజిలయ్య (సోమన్‌గుర్తి) మహిళా ఉపాధ్యక్షులుగా ప్రభావతి (చన్‌గోముల్) కార్యదర్శిగా బాల్‌రాజ్ (మంచన్‌పల్లి) మహిళా కార్యదర్శిగా హేమలత (పూడూరు) ఉపాధ్యక్షులుగా కె, నర్సిములు (అంగడిచిట్టంపల్లి) కార్యదర్శులుగా నజీమోద్దిన్ (నిజాంపేట్‌మేడిపల్లి) పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

తిర్మలాపూర్ అటవీ భూముల పరిశీలన

పూడూరు: మండల పరిధిలోని తిర్మలాపూర్ అటవీ భూములను ఆర్మీ అధికారులు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపయోగం కోసం హైదరాబాద్ నగరంలో ఉన్న ఆర్మీ స్థలాలను ప్రభుత్వం తీసుకునే యోచనలో ఉండటంతో విలువైన స్థలాలను కోల్పోవటం మూలంగా దానికి బదులుగా నగరానికి సమీపంలో భూములను ఆర్మీకి కేటాయించేందుకు ప్రభుత్వం యోచిస్తుంది. ఇందులో భాగంగా ఆర్మీ ఉన్నతాధికారుల బృందంతో పాటు స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో తిర్మలాపూర్‌తండా, రాకంచర్ల శివారులోని అటవీశాఖకు చెందిన భూములను చూశారు. గుట్టతో కూడిన ఎత్తు ప్రదేశం కలిగి ఉండటంతో ఇక్కడ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు అనువైందని అభిప్రాయంతో ఉన్నారని తహసీల్దారు కిషన్ వెల్లడించారు. భూముల పరిశీలన మాత్రమే అని ఇంకా నిర్ధారణ కాలేదని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఆర్ఐ మహేశ్ తదితరులున్నారు.

ఆందోళన ఆగదు


సమ్మెలో పాల్గొన్న సమన్వయకర్తలు

పరిగి,న్యూస్‌టుడే: ఎంతో కాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సాక్షర భారతి గ్రామ సమన్వయకర్తలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యాభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్నా తమకు గుర్తింపు లేకుండా పోయిందని చెప్పారు. అక్షరాస్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని వయోజన విద్య కేంద్రాలను మినీ గ్రంథాలయాలుగా గుర్తించాలని తెలిపారు. నెలనెలా గౌరవ వేతనం చెల్లించాలని ప్రమాదభీమా సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఉద్యోగ బధ్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సమన్వయకర్తలు బి.అంజిలయ్య, ఎ.బాల్‌రాజ్, అశోక్, కృష్ణయ్య, నర్సిములు పాల్గొన్నారు.

సామూహిక దీక్షను విజయవంతం చేయాలి


దోమలో వినతి పత్రం అందచేస్తున్న ఉపాధ్యాయులు


ఎంఈఓ అంజిలయ్యకు సెలవు పత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛన్‌కు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న జరప తలపెట్టిన సామూహిక దీక్షను విజయవంతం చేయాలని వైద్యులు, ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని సామాజిక ఆసుపత్రి వద్ద గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘ బాధ్యులు విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా ఉన్న పింఛను పథకాన్ని రద్దు చేయాలని కోరారు.

దోమ, న్యూస్‌టుడే: సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేయాలని ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ధనేశ్వర్ అన్నారు. బుధవారం దోమ మండలం ఐనాపూర్ ఉన్నత పాఠశాలలో సామూహిక సెలవు కోరుతూ ఉపాధ్యాయులు వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1.9.2004లో సీపీఎస్ విధానం అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. దీన్ని రద్దు చేసేవరకు విధుల్లో చేరబోమని జాక్టో హెచ్చరించిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు సంఘటిత పోరాటానికి నడుం బిగించాయని తెలిపారు. కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించే వరకు ఉద్యమిస్తామని పలువురు పేర్కొన్నారు. సెప్టెంబరు1న సామూహిక సెలవులతో బడులన్నీ మూతపడే ప్రమాదం ఉందని, ఫలితంగా విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆలోచించి పాత పెన్షన్ విధానం అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నజిరుద్దీన్, కృష్ణయ్య, బ్రహ్మచారి, వెంకటయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిగి, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం మండల ఇంఛార్జి విద్యాధికారి అంజిలయ్యకు రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సామూహిక సెలవు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.జైపాల్, వి.పాండురంగాచారి మాట్లాడుతూ సెప్టెంబరు 1న పింఛన్ విద్రోహ దినంగా పాటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు మోయిజ్‌ఖాన్, జె.శ్రీనివాస్, పృథ్వీ, యాదగిరి, సంగీత, ఝాన్సీబాయి, భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుల సంఘం కార్యవర్గం


ఎం.రాఘవేందర్‌రావు

పరిగి,న్యూస్‌టుడే: ఉపాధిహామీ క్షేత్ర సహాయకుల నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగాయి. మండల శాఖ అధ్యక్షునిగా ఎం.రాఘవేందర్‌రావు (గడిసింగాపూర్), కార్యదర్శులుగా కె.స్వామి (సుల్తాన్‌పూర్), టి.రాజు (పరిగి), ఉపాధ్యక్షునిగా ఎం.నర్సిములు (రాపోల్), కోశాధికారులుగా డి.రాందాసు (బసిరెడ్డిపల్లి), వి.మహేందర్ (కాళ్లాపూర్), సలహాదారులుగా బి.శేఖర్ (బర్కత్‌పల్లి), కె.శంకర్ (సయ్యద్ మల్కాపూర్), కె.మల్లయ్య (మిట్టకోడూరు), టి.అంజయ్య (చిట్యాల్), ఎల్లప్ప (రంగంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కలిసి మెలిసి పనిచేయండి


పెంటయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ భారతమ్మ సంఘం నాయకులు

పూడూరు: రాకంచర్ల ఆలయ క్షేత్రంలో బుధవారం పీఆర్టీయూ మండలశాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఎంపీపీ భారతమ్మ మాట్లాడారు. అందరూ కలిసి మెలిసి పనిచేయాలని, పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసి అధిక మెజార్టీ కట్టబెట్టారని చెప్పారు. అనంతరం స్థానిక సర్పంచి పెంటయ్య బహుకరించిన శాలువాలు, పతకాలతో సంఘం నాయకులను ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాములు, కృష్ణారెడ్డి, అనంత్‌రావు, సంజీవన్‌కుమార్, అంజిలయ్య, కిష్టయ్య, జాహంగీర్, మహేందర్‌రెడ్డి, బుచ్చిబాబు, నజీమోద్దిన్, బాల్‌రాజ్, నర్సిములు ఉన్నారు.

1న గౌడ సంఘం సమావేశం

బొంరాస్‌పేట: మండలంలోని గౌడసంఘం సమావేశాన్ని సెప్టెంబరు 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండలాధ్యక్షుడు సూర్యప్రకాశ్‌గౌడ్, నర్సింహులు గౌడ్ అన్నారు. ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఉపాధి అవకాశాలు లేకుండా కొత్తపాలసీ విధానాన్ని తీసుకొస్తూ మద్యం అమ్మకాలు పెరగడానికి ప్రోత్సహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గీత కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఏర్పాటు చేస్తున్న సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

పరిగి

సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యం

పరిగి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సామాజిక తెలంగాణను సాధించడమే తమ ముందున్న లక్ష్యమని తెలంగాణ ఇంటి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రామన్న అన్నారు. బుధవారం పరిగిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. సామాజిక వర్గాలకు రాజ్యాధికారం వస్తేనే బడుగులు బాగుపడతారని చెప్పారు. జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, నర్సిములు, బాబు, బందెయ్య తదతరులు పాల్గొన్నారు.

రోడ్లపై బురద... కాలువలు లేక పారని మురుగు!

ప్రధాన చౌరస్తా అధ్వానం

కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ: కుల్కచర్ల గ్రామంలోని ప్రధాన చౌరస్తా బురదమయంగా మారింది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలలో నీరు నిలిచిపోతుంది. దీంతో ఎక్కువగా వాహనాలు తిరుగుండటం వలన బురదగా మారింది. రోడ్డు వెంబడి వెళ్ళాలంటే క్లిష్ట పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు తెలియజేస్తున్నారు. కాలినడకన వెళ్ళే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వాహనాలు వేగంగా వెళితే బురదపైకి వస్తుందంటున్నారు స్థానికులు. గత కొన్ని రోజులుగా ప్రధాన చౌరస్తాలో ఇదే సమస్య ఉన్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు ఇదే రోడ్డు వెంబడి కార్యాలయాలకు అధికారులు వెళుతున్నా సమస్యపై ఏవిధంగానూ చొరవ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన చౌరస్తాలో ఉన్న గుంతలలో మట్టిని పోయించి బురద ఏర్పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



బురదమయంగా కుల్కచర్ల ప్రధాన చౌరస్తా

కాలువ తీయడంతో ఏర్పడిన గుంత

బండవెల్కిచర్ల, కుల్కచర్ల గ్రామీణ: కుల్కచర్ల నుంచి బండవెల్కిచర్లకు వెళ్ళే మార్గంలో రోడ్డుకు పక్కన దారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు రోడ్డు పక్క నుంచి నడిపించాలంటే చోదకులు భయపడుతున్నారు. గురుకుల పాఠశాలకు నీటిని సరఫరా చేయడానికి రోడ్డు పక్క నుంచే కాలువ తవ్వించారు. కాలువను మట్టితో సక్రమంగా పూడ్చక పోవడం ద్వారా ఈ సమస్య ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో అకస్మాత్తుగా రోడ్డుకు పక్క నుంచి వాహనాలు వెళితే గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. దారిపొడవునా గుంత ఏర్పడినా కూడా సంబంధింత అధికారులు ఎవరూ పట్టించకోక పోవడం గమనార్హం. అధికారులు స్పందించి మట్టితో గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు.



బండవెల్కిచర్లకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే గుంత

ఫోకస్

విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలి



ముజాహిద్‌పూర్‌లో తీగను ఏర్పాటు చేయని స్తంభం

ముజాహిద్‌పూర్, కుల్కచర్ల గ్రామీణ: ముజాహిద్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన స్తంభాలకు తీగను అమర్చపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్తంభాలను ఏర్పాటు చేసిన అధికారులు తీగలను అమర్చడం మరిచిపోయారని కాలనీవాసులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇవి ఇలాగే కనిపిస్తున్నాయి. కుల్కచర్ల అంగడి బజార్‌లో కూడా స్తంభాన్ని ఏర్పాటు చేసి తీగలను బిగించడం మరిచిపోయారు. తీగలను బిగించడం ద్వారా ఇళ్లల్లోకి అందుబాటులో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి కనెక్షన్‌ను తీసుకోవచ్చునని వారు పేర్కొంటున్నారు. అంతేకాకుండా విద్యుత్ స్తంభానికి వీది దీపాలు కూడా ఏర్పాటు చేసుకునే వీలుంటుందంటున్నారు. అధికారులు చొరవ తీసుకుని అవసరం ఉన్న చోట్ల తీగను బిగించేలా చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిలిచిపోతున్న మురుగు

కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ: కుల్కచర్ల గ్రామంలో చాలా వరకు మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోతుంది. గత కొన్ని నెలలుగా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మురుగు వ్యవస్థపై గ్రామ స్థాయి అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధాన చౌరస్తా, తపాలా కార్యాలయం, ప్యాటగడ్డ, గ్రామ పంచాయతీ పక్కన ఉన్న కాలనీలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దోమలు అత్యధికంగా వ్యాపిస్తున్నాయి. రాత్రి సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరం ఉన్న చోట మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



కాలువలు లేక నిలిచిన మురుగు

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న శ్యాం, స్థానిక భక్తులు

కండ్లపల్లి (పూడూరు): మండల పరిధిలోని కండ్లపల్లి రెవెన్యూ శివారులో ఉన్న ధరణి పత్తినూలు కేంద్రంలో నెలకొల్పిన వినాయకుడి నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు శ్యాం కుటుంబం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించటంతో పాటు అన్నదానం చేశారు. అనంతరం ఉరేగింపు ప్రారంభం అయ్యింది. విగ్రహం ముందు చిందులు వేస్తూ చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీష్, కృష్ణయ్య, బాలయ్య, రాములు తదితరులున్నారు.



నిమజ్జనానికి సిద్ధంగా విఘ్నేశ్వరుడు

పరిగి: పరిగి నియోజకవర్గంలో గణేష్ నిమజ్జనం ఊపందుకుంటోంది. ఈనెల 25న వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆయా ప్రాంతాల వారీగా నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా వాడవాడలా కోలాహలం నెలకొంటోంది.



పరిగి బీసీ కాలనీలో వినాయకునికి పూజలు

ఏఈపై దాడి: ముగ్గురిపై కేసు

పరిగి,న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న ఏఈపై దాడి జరిగింది. ఈసంఘటన బుధవారం పరిగిలో చోటు చేసుకున్నట్లు ఎస్సై క్రిష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిగికి చెందిన హాశం రూ.1.2లక్షల మేరకు తన ఇంటికి సంబంధించి కరెంటు బిల్లులు బకాయి పడ్డాడు. కరెంటు కనెక్షన్ తొలగించడంతో ఆగ్రహించిన హాశంతో అతని ఇద్దరు కుమారులు దాడికి పాల్పడినట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడంతో పాటు విధి నిర్వహణకు ఆటంకం కలిగించడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ సంక్షేమ నిధిని విడుదల చేయాలి

తాండూరు: బీసీల కోసం సీఎం కేసీఆర్ ప్రకటించిన సంక్షేమ నిధిని వెంటనే విడుదల చేయాలని భాజపా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొప్పి సురేష్, ఉపాధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ కోరారు. మూడేళ్ల నుంచి ఏడు వేల మంది లబ్ధిదారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా నిరాశే ఎదురవుతోందన్నారు.

సకాలంలో చెల్లించిన సంఘాలకు వడ్డీలేని రుణాలు



కంకల్‌లో మాట్లాడుతున్న మేనేజరు

కంకల్ (పూడూరు): బ్యాంకుల్లో తీసుకుని సకాలంలో డబ్బులు చెల్లించిన సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తామని కంకల్ ఎస్బీఐ శాఖ మేనేజరు వరప్రసాద్ పేర్కొన్నారు. బ్యాంకులో బుధవారం ఆయా గ్రామాలకు చెందిన సభ్యులు, ఐకేపీ సిబ్బంది సమక్షంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పరిధిలోని గ్రామాలకు చెందిన 132 సంఘాలు రుణాలు తీసుకోగా ఇందులో 72 సంఘాలు సకాలంలో చెల్లించలేదని చెప్పారు. మొండి బకాయిలుగా ఉంటే ఇతరులకు ఇచ్చేందుకు ఇబ్బందులు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఇప్పటికయినా చెల్లిస్తే తిరిగి సకాలంలో రుణాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కొమరయ్య వెలుగు సీసీ సంజీవ తదితరులున్నారు.

'కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

నారాయణగూడ: కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ప్రభుత్వం, నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం నిజాం కళాశాల నుంచి ఊరేగింపుగా దిష్టి బొమ్మను తీసుకొచ్చి బషీర్‌బాగ్ జగ్జీవన్‌రామ్ విగ్రహం కూడలిలో దహనం చేశారు. టీజీవీపీ నగర అధ్యక్షులు తాడెం రాజేశ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు ఎక్కువయ్యాయని, విద్యార్థుల ప్రాణాలు బలితీసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాలయాలను కాస్త కేంద్ర కారాగారాలుగా మార్చివేశారని పేర్కొన్నారు. పిల్లలను ర్యాంకులు సాధించే మర మనుషులుగా మార్చేస్తున్నారని ధ్వజమెత్తారు.

నవభారత నిర్మాణమే లక్ష్యం

ఐఐటీలో సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

సంగారెడ్డి టౌన్: నవభారత నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఐఐటీ విద్యార్థులు ప్రతినబూనారు. మండల కేంద్రమైన కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో బుధవారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ విభాగం ఆధ్వర్యంలో 'సంకల్ప్ సే సిద్ధి', 'ఏ ఇండియా కా టైం హై' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంతన్ పేరిట నిర్వహించిన సదస్సులో నవ భారత్ నిర్మాణంపై చర్చలు జరిగాయి. విద్యార్థులు, ఆచార్యులు ఇందులో భాగస్వాములయ్యారు. విద్యార్థులు తాము ఏమి కోరుకుంటున్నారో, దేశహితం కోరుతూ సూచనలు చేశారు. ఆచార్యులు కూడా చర్చలో భాగంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, సాంకేతిక పరిష్కారాలు అన్న అంశంపై చర్చ ఆసక్తికరంగా సాగింది. సదస్సును ఉద్దేశించి ఐఐటీ డైరెక్టర్ యు.బి. దేశాయ్ మాట్లాడుతూ నవభారత్ కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందుకు అనుగుణంగా వినియోగించేందుకు పరిశోధనలు జరగాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన రాక్‌బ్యాండ్ కళాకారులు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.



రాక్‌బ్యాండ్‌లో గీతాలను ఆలపిస్తున్న కళాకారులు



పాల్గొన్న విద్యార్థులు

క్షయ ఆసుపత్రికి విద్యుత్తు సరఫరా నిలిపివేత

వికారాబాద్: విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో అనంతగిరిలోని క్షయ ఆసుపత్రికి విద్యుత్తు అధికారులు సరఫరాను మంగళవారం సాయంత్రం నిలిపివేశారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 55 మంది రోగులు రాత్రిపూట అంధకారంలోనే గడిపి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే చుట్టంతా అటవీ ప్రాంతం.. దీనికి తోడు వెలుగు లేపోవడంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. పరిస్థితిని అర్థం చేసుకుని విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



ఇబ్బందులు పడుతున్న రోగులు

1 నుంచి వాలీబాల్ పోటీలు



పనులను పర్యవేక్షిస్తున్న పీడీ మల్లికార్జున్

కుల్కచర్ల గ్రామీణ: దాస్యనాయక్‌తండాలో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, పరిగి డివిజన్ అధ్యక్షుడు రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సేవాలాల్ సేనా సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఎంట్రీ ఫీజు చెల్లించిన వారికి నేడు డ్రా తీయనున్నట్లు వారు తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా 10 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 6 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతిభావంతులైన వారిని గుర్తించేందుకే ఈ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. పీడి మల్లికార్జున్ టోర్నమెంట్‌కు సంబంధించిన పనులను పర్యవేక్షించారు. క్రీడల నిర్వహణకు తమకు సహకరించాలని తండా యువకులు మల్లికార్జున్ కోరారు. వివరాలకు 7036767577, 9912473200 అనే నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని వారు సూచించారు. టోర్నమెంట్ జరిగే మూడు రోజులు క్రీడలలో పాల్గొనే వారికి ఉచిత భోజన వసతి కూడా ఉంటుందని తెలియజేశారు.

జోనల్ విధానం రద్దుపై ఆందోళన వద్దు



రాకంచర్లలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

పూడూరు: జోనల్ విధానం రద్దుతో ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వచ్చే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యవధిలోనే జరగనున్నట్లు పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి వెల్లడించారు. రాకంచర్ల ఆలయ క్షేత్రంలో బుధవారం పీఆర్టీయూ మండలశాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ వస్తే ఎంతో మంది ఉపాధ్యాయులకు ఎంఈవోలుగా, జూనియర్ లెక్చరర్, డైట్ అధ్యాపకులుగా పదోన్నతలు లభిస్తాయని ఆయన చెప్పారు. దసరా పండుగలోపే చేపట్టే విధంగా ప్రయత్నిస్తున్నప్పటికీ కొన్ని న్యాయపరంగా చిక్కులు రావటంతో జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. పీఆర్టీయూ సంఘం ఏర్పడిన తరువాత పోరాడి అనేక విజయాలు సాధించినట్లు చెప్పారు. అన్ని సంఘాల కంటే బలమైందని పీఆర్సీ అంతం..పీఆర్టీయూ పంతం అనే నినాదంతో వచ్చేనెల ఒకటిన వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే నిరసనకు ఉద్యోగులంతా సామూహిక సెలవులు పెట్టి ఉద్యమానికి మద్దతు తెలపాలన్నారు. ఎంపీపీ భారతమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు హక్కులను సాధించుకోవటంతో పాటు విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్, రాఘవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో సంఘానికి మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనంతో కలకలం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి రక్తనిధి కేంద్రం వద్ద బుధవారం ఒక్కసారిగా కలకలం చోటుచేసుకొంది. పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ బృందం అక్కడికి రావడంతో అక్కడేం జరిగిందో అర్థం కాక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. జూబ్లీహిల్స్ రోడ్డు నం.1లోని చిరంజీవి రక్త నిధి కేంద్రం ఎదుట పది రోజులుగా తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో కూడిన ద్విచక్రవాహనం నిలిపి ఉంది. రక్త నిధి కేంద్రం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఐ ముత్తుతోపాటు సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ అధికారి రమేష్ అక్కడికి చేరుకున్నారు. ప్రత్యేక జాగిలాలతో తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదం లేదని భావించిన పోలీసులు వాహనాన్ని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నంబరు ప్లేటు సరిగా లేకపోవడం వల్ల ఇంజిన్ నంబరును రవాణా శాఖ అధికారులకు పంపారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఫలక్‌నుమా ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన మహ్మద్ అక్రమ్ కుమారుడు, ఎలక్ట్రిషియన్ మహ్మద్ ఇమ్రాన్(20) మంగళవారం రాత్రి జంగమ్మెట్ ఖాద్రీచమన్ మార్గంలో రిసాలా ప్లేగ్రౌండ్ ఎదురుగా ఉన్న గల్లీలోని ఓ ఇంట్లో ఫంక్షన్ ఉండగా రెండు ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి డాబా పైకి ఎక్కి ఫోకస్ లైట్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతనిని శాలిబండలోని ఆస్రా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్ఐ సాయికిరణ్, గోకారిలు సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నేరుగా విద్యుత్ తీగెల నుంచి అక్రమ విద్యుత్ కనెక్షన్ తీసుకోవడం, ఎర్తింగ్ లేకపోవడం, డాబాపై వర్షపునీళ్లు నిలిచి ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ పీజీ విద్యార్థినికి వేధింపులు

ఈనాడు, హైదరాబాద్: ముందు స్నేహం చేసి.. తర్వాత నిర్లక్ష్యం చేసిందనే అక్కసుతో ఓయూ పీజీ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన తోటి విద్యార్థిని నగర సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీసీఎస్ డీసీపీ అవినాశ్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన విద్యార్థిని(21) ఓయూలో ఎమ్మెస్సీ జియోఫిజిక్స్ రెండో సంవత్సరం చదువుతోంది. వరంగల్ జిల్లా తొర్రూరు మండలం ఫతేపురానికి చెందిన ఎర్నం నరేశ్(25) ఓయూ హాస్టల్‌లో ఉంటూ ఆమెతోపాటే చదువుతున్నాడు. 2016 నుంచి పరిచయం పెంచుకున్న నరేశ్ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసే నెపంతో బాధితురాలి మెయిల్‌ఐడీ, పాస్‌వర్డ్ తీసుకున్నాడు. అనంతరం కొంతకాలానికి అతడి వైఖరి నచ్చకపోవడంతో విద్యార్థిని గత జూన్ నుంచి అతడిని దూరం పెడుతూ వచ్చింది. చరవాణి నంబరునూ మార్చేసింది. దీంతో అక్కసు పెంచుకున్న నరేశ్ ఫేస్‌బుక్‌లో వేధింపులకు ఉపక్రమించాడు. ఆమె స్నేహితురాళ్లకు బాధితురాలి గురించి అసభ్యకర సందేశాలు పంపించడం ఆరంభించాడు. పద్ధతి మార్చుకోవాలని బాధితురాలు హెచ్చరించింది. నరేశ్ వైఖరి మారకపోవడంతో షీ బృందానికి ఫిర్యాదు చేసింది. నిందితుడు మరింత రెచ్చిపోయి.. నేరుగా బాధితురాలి సోదరుడి చరవాణికే అసభ్య సందేశాలు పంపిస్తున్నాడు. బాధితురాలు మంగళవారం సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం నరేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఆయకట్టుకు కటకట!

(మొదటిపేజీ తరువాయి) భూగర్భ జలాలు తగ్గిపోయి బోరుబావుల్లో నీటి శాతం తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశలన్నీ సెప్టెంబరుపైనే

గత సంవత్సరం సెప్టెంబరులో కుంభవృష్టి కారణంగా చిన్న, పెద్ద తరహా చెరువులు, కుంటలన్నీ నీటితో నిండిపోయి, అలుగులు దుంకాయి. ఈఏడాది ఆగస్టు పూర్తవుతున్నా చెరువులు వెలవెలబోతున్నాయి. నిరుటి మాదిరే ఈసారి కూడా సెప్టెంబరులో భారీ వర్షాలు కురుస్తాయంటూ రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు సమృద్ధిగా కురిస్తే చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు చేరుతుందని, యాసంగి సాగుకు నీటి కొరత లేకుండా వరి సాగు సజావుగా సాగుతుందంటున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల నుంచి పుష్కలంగా నీరు వచ్చే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నిండిన చెరువుల వివరాలు సున్నా నుంచి వంద శాతం వరకు ఇలా...

నియోజకవర్గం	చెరువులు	0–25%	25–50%	50–75%	75–100%
తాండూరు	255	108	109	24	14
కొడంగల్	213	213	0	0	0
పరిగి	385	385	0	2	0
వికారాబాద్	305	120	96	2	27
	1,158	824	205	88	41

ఆదా చేసుకోవడమే మేలు


–చంద్రశేఖర్, సాగునీటి విభాగం జిల్లా అధికారి

ఒకట్రెండు భారీ వర్షాలు కురిస్తే చాలు చెరువులన్నీ నీటిలో కళకళలాడే అవకాశం ఉంది. వానాకాలం మొదట్లో కురిసిన వర్షాలకు వచ్చిన కొద్దిమేర నీరు నిలువ ఉంది. ఆనీటినే ఆయకట్టు రైతులు వానాకాలం వరి సాగుకు వినియోగించుకుంటున్నారు. సెప్టెంబరులో భారీ వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్నాం. ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకునేలా రైతులకు వివరిస్తున్నాం.

ఎస్‌హెచ్‌వోలు ఎవరు!

కొత్త ఠాణాలపై కొనసాగుతున్న సందిగ్ధం

జంట కమిషనరేట్లపై తేలని పీటముడి



ఈనాడు, హైదరాబాద్

రాజధాని కేంద్రంగా ఉన్న హైదరాబాద్, ఉమ్మడి సైబరాబాద్ కమిషనరేట్లలోని ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా ఇన్‌స్పెక్టర్లుండటం ఆనవాయితీ. ఆయా ఠాణాల్లోని ప్రాంతాల్ని సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టారుకు ఎస్సైని నియమించడం ఇప్పటివరకు కొనసాగుతున్న పద్ధతి. కానీ ఉమ్మడి సైబరాబాద్‌ను విభజించి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఏర్పాటు చేశాక పరిస్థితిలో చాలా వరకు మార్పు వచ్చింది. ఈ రెండు కమిషనరేట్లలో గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్తగా చేరిన ఠాణాల్లో ఎస్సైలే ఎస్‌హెచ్‌వోలుగా కొనసాగించాల్సి వచ్చింది. కానీ జంట కమిషనరేట్లు ఆవిర్భవించి ఏడాది దాటినా ఆయా ఠాణాలను అప్‌గ్రేడ్ చేసే విషయంలో నెలకొన్న సందిగ్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆయా ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించేందుకు అనుమతి లభిస్తుందా..? లేక ఇప్పటి మాదిరిగానే ఎస్సైలనే ఠాణాలకు బాధ్యుల్ని చేస్తారా..? అనేది అనిశ్చితిగానే ఉంది.

రాచకొండలో 17.. సైబరాబాద్‌లో 12

విభజన అనంతరం సైబరాబాద్ కమిషనరేట్‌లోకి పాత మహబూబ్‌నగర్‌తోపాటు మెదక్ జిల్లాల నుంచి కొన్ని ఠాణాలను విలీనం చేశారు. అలాగే రాచకొండలోకి కొత్తగా ఏర్పడిన యాదాద్రి జిల్లాను మొత్తంగా చేర్చారు. ఈ నేపథ్యంలో జంట కమిషనరేట్లలో కొత్తగా చేరిన ఠాణాల్లో చాలా వాటికి ఎస్సైలనే ఎస్‌హెచ్‌వోలుగా కొనసాగిస్తున్నారు. సైబరాబాద్ పరిధిలో కొత్తగా చేరిన చేవెళ్ల, షాద్‌నగర్, షాద్‌నగర్ రూరల్, అమనగల్లుతోపాటు రాచకొండలో విలీనమైన భువనగిరి, యాదగిరి గుట్ట, చౌటుప్పల్, రామన్నపేట ఠాణాలకు మాత్రం అప్పటికే సర్కిళ్లు ఉండటంతో ఇన్‌స్పెక్టర్లున్నారు. వీటితోపాటు సైబరాబాద్‌లో మరో 12, రాచకొండలో మరో 17 కొత్త ఠాణాలు కలిశాయి. వీటన్నింటికి ప్రస్తుతం ఎస్సైలే ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. ఈ ఠాణాలనూ అప్‌గ్రేడ్ చేయాలని గతంలోనే రెండు కమిషనరేట్ల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ సైబరాబాద్ విభజన జరిగి ఏడాది దాటినా ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

అంత అవసరం ఉందా..?

వాస్తవానికి కమిషనరేట్ల పరిధిలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఠాణాల విస్తీర్ణం పరిధి తక్కువగా ఉన్నా సీఐ స్థాయి అధికారినే ఎస్‌హెచ్‌వోగా నియమిస్తారు. అలాగే సెక్టార్లుగా విభజించి ఎస్సైలకు బాధ్యతలు అప్పగిస్తారు. ఉమ్మడి సైబరాబాద్‌లో కనిష్ఠంగా నలుగురి నుంచి గరిష్ఠంగా తొమ్మిది మంది వరకు ఎస్సైలుండేవారు. కానీ విభజన తర్వాత జంట కమిషనరేట్ల స్వరూపాలే మారిపోయాయి. నెలలో కనీసం పది కేసులైనా నమోదు కాని ఠాణాలూ కమిషనరేట్లలో అంతర్భాగమయ్యాయి. పట్టుమని పదివేల జనాభా కూడా లేని ఠాణాలూ ఈ జాబితాలో వచ్చి చేరాయి. దీంతో ఇలాంటి ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా ఇన్‌స్పెక్టర్లు అవసరం ఉంటుందా..? అనే అభిప్రాయాలూ లేకపోలేదు. ఆ ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లను నియమించడం.. సెక్టార్లను ఏర్పాటు చేసి ఎస్సైలను కేటాయించడం అనవసరపు ప్రహసనమే అవుతుందని పోలీస్‌వర్గాలే భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందనే విషయంపై సందిగ్ధం కొనసాగుతూనే ఉంది.

డ్రగ్స్ కేసులో రెస్టారెంటు నిర్వాహకుడి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: డ్రగ్స్ కేసులో ఓ రెస్టారెంటు నిర్వాహకుడిని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వేంకటేశ్వర్‌రావు నిందితుని వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం కడపజిల్లా మైదుకూరుకు చెందిన కొప్పర్తి అన్నారపు పవన్‌కుమార్‌రెడ్డి(34) బీటెక్ పూర్తిచేశాడు. నగరంలోని కొండాపూర్ కొత్తగూడ సమీపంలోని శ్రీరాంనగర్‌లో ఉంటున్నాడు. గతంలో హైదరాబాద్, దిల్లీ ఐటీసంస్థల్లో ఉద్యోగంచేసి 2014లో మానేసి సొంతవ్యాపారం పెట్టుకున్నాడు. తాజాగా షేక్‌పేటలో వర్షిత ఫ్యామిలీ మల్టీవెర్షన్ రెస్టారెంటు నడుపుతున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఓవర్ ది మూన్ పబ్ (ఓటీఎం)కు తరచూ వెళ్తుంటాడు. గతేడాది నవంబరులో స్నేహితులతో కలిసి గోవా వెళ్లిన పవన్‌కుమార్‌రెడ్డికి అక్కడ యాన్ అనే నైజీరియన్ పరిచయమయ్యాడు. యాన్ ద్వారా కొకైన్‌కు బానిసైన పవన్‌కుమార్‌రెడ్డి.. దానిని ఒక్కో గ్రాముకు రూ.5వేలకు కొనుగోలు చేసి తాను సేవించడమే కాకుండా స్నేహితులకు సైతం అమ్మడం ప్రారంభించాడు. తరచూ గోవా వెళ్లి కొనుగోలు చేసే అతనికి నగరంలోనే ఉండే కాస్మోస్ అనే నైజీరియన్‌ను పరిచయం చేశాడు యాన్. దీంతో వీరిద్దరి వద్ద కొకైన్ కొని ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతోపాటు నగరంలోని పబ్‌లలో ఈవెంట్లు నిర్వహించే మేనేజర్‌గానూ వ్యవహరిస్తున్నాడు. ఈవెంట్ల కోసం ముంబయి, బెంగళూరు, కొల్‌కత్తా, దిల్లీలకు చెందిన మహిళా మోడళ్లను రప్పించేవాడు. ఈవెంట్లకు వచ్చే కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేయడంతోపాటు మోడళ్లుగా వచ్చిన యువతులను అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తూ సొమ్ముచేసుకుంటున్నాడన్న సమాచారం పోలీసులకు ఉంది. ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీసులు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు నైజీరియన్లతోపాటు మరో నలుగురు స్థానికులను అరెస్టుచేశారు. ఇదే కేసులో నిందితుడైన పవన్ కుమార్‌రెడ్డిని తాజాగా అరెస్టుచేశారు. సదరు నిందితుడిని కస్టడీలోకి తీసుకుని తదుపరి విచారణ చేపడతామని డీసీపీ తెలిపారు.



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వేంకటేశ్వర్‌రావు

ఊరూవాడా టేకు జపం

(మొదటిపేజీ తరువాయి) జిల్లావ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. వేర్లు పంపిణీ చేయడం ద్వారా చాలా వరకు లక్ష్యం చేరవవుతామని అధికారులు యోచిస్తున్నారు.

నాణ్యత పరిశీలించాకే సరఫరా

టేకు మొక్కలకు గ్రామాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఇప్పటికే రైతులు బంజరు భూములు, పొలాల గట్ల పైన విస్తారంగా పెంచుతున్నారు. 25 ఏళ్ల అనంతరం విక్రయించుకుంటే లాభాలే లాభాలు. ఒక్కో మండలానికి 25 వేల చొప్పున పంపిణీ చేస్తున్న అధికారులు మొదటగా వీటి నాణ్యతను పరిశీలించనున్నారు. ఇవి బాగున్నాయని ప్రజల నుంచి స్పందన వస్తే మరిన్ని తెప్పించాలని లేదా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాలని ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఒక కాండం(స్టంపు) కోసం రూ.4.29 ఖర్చు చేస్తున్నారు. టేకుతోపాటు గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మలబార్ మొక్కలు కూడా సరఫరా చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. రైతుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసేందుకు సిద్ధమని అధికారులు తెలిపారు. గతంలోనూ తమిళనాడు నుంచి తెప్పించి పంపిణీ చేయడంతో టేకు వేర్లను హాట్ కేకుల్లా అందుకున్నారు. రైతులు తమ పేర్లు, ఆధార్ కార్డుల జిరాక్సు ప్రతులతో మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



పరిగి సమీపంలో పెరుగుతున్న టేకు మొక్కలు




అనంత రమణీయం

- వన్యప్రాణి రక్షణకు ప్రత్యేక చర్యలు
- చెక్‌పోస్టులు ఏర్పాటు.. భారీ వాహనాలపై ఆంక్షలు
- అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై కసరత్తు

న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్

ఆకాశాన్ని తాకుతున్నాయా అన్నట్లుగా ఉండే కొండలు, పచ్చని బయళ్లు, ప్రకృతి రమణీయతకు ఆలవాలం అయిన అనంతగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ఔషధ మొక్కలకు, ప్రకృతి సంపదకు ప్రసిద్ధి చెందిన అనంతగిరి అడవులను కన్జర్వేషన్ రిజర్వ్ (పాక్షిక అభయారణ్యం)గా మార్చడానికి యోచిస్తున్నారు. దట్టమైన అడవిలోని వన్యప్రాణుల రక్షణకు అనంతగిరి కొండల మధ్య ఉన్న రహదారుల వెంట భారీ వాహనాల రాకపోకలను, రాత్రివేళ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని సంబంధిత శాఖ జిల్లా అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతగిరి కొండల్లో కేరళలోని పర్యావరణ ప్రకృతి వైద్యం అందించే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ గతంలో అధికారులను ఆదేశించారు. దీంతో ఉన్నత స్థాయి అధికారులు, జిల్లా పాలనాధికారిణి దివ్య క్షేత్రస్థాయిలో పర్యటించి అనంతగిరి అడవులను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చనే విషయంపై ప్రాథమిక నివేదిక తయారు చేశారు. మొత్తం 1,654 హెక్టార్లలో ఉన్న అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. దీనిలో అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో పాటు మరి కొంత ప్రాంతాన్ని మినహాయించనున్నారు.



పాములా మెలికలు తిరిగిన రైల్వే లైను

వాహనాల మళ్లింపు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 75 కిమీ దూరంలో ఉన్న అనంతగిరి అడవులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అనంతగిరి తెలంగాణ ఊటీగా ప్రసిద్ధి గాంచింది. అయితే పర్యాటకులు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించి ఎక్కడ పడితే అక్కడ పారవేయడంతో వన్యప్రాణులకు ముప్పుగా పరిణమిస్తోంది. దీంతో పాటు ఈ ప్రాంతం గుండా భారీ వాహనాలు రాత్రి సమయంలో వెళ్తుండటంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణులు సంచరించే ఈ ప్రాంతం గుండా భారీ వాహనాలను వెళ్లకుండా నిషేధించి, చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏడాదికి పదికి పైగా వన్యప్రాణులు వాహనాల వల్ల బలవుతున్నట్లు అధికారులు నివేదికలో తేల్చారు. అనంతగిరి అడవుల్లో జింకలు, పక్షులు, రకరకాల వన్యప్రాణులు నివసిస్తున్నాయి. అన్ని వాహనాలను కెరెళ్లి నుంచి ఎన్‌టీఆర్ రోడ్డు మార్గం గుండా మళ్లించాలని నిర్ణయించారు.


వివిధ శాఖలకు అభివృద్ధి పనుల అప్పగింత

అనంతగిరికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు అనంతగిరి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. ఇందులో ప్రధాన శాఖలకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. నీటి, సరస్సుల అభివృద్ధిని నీటి పారుదల శాఖకు, రహదారుల అభివృద్ధిని ఆర్ అండ్ బీకి, గ్రామీణ అభివృద్ధి శాఖకు బాటిళ్లు, బట్టి బ్యాగులు సరఫరా చేసే బాధ్యత, దేవదాయ శాఖకు ఆలయ అభివృద్ధిని అప్పగించాలని నిర్ణయించారు.

అటవీ సంపద కాపాడుతాం...

– శ్రీలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారిణి


వన్యప్రాణుల సంరక్షణతో పాటు అటవీ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. దీనిలో భాగంగా అనంతగిరి అటవీ ప్రాంతం నుంచి భారీ వాహనాలను నిషేధిస్తారు. ఇతర రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు సాగేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. జింకలు వాహనాల కింద పడి అధికంగా మృత్యువాత పడుతున్నాయి. వీటిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



బ్యాటరీలతో నడిచే వాహనాలు

భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. బ్యాటరీలతో నడిచే వాహనాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. దీంతో అటవీ ప్రాంతంలో వెళ్లే సమయంలో వీటిని మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది.

పరిశుభ్రతకు ప్రోత్సాహం... ప్రతిభకు పట్టం!



కంకల్ ఉన్నత పాఠశాల ఇదే...

- కంకల్ ఉన్నత పాఠశాలకు దక్కిన స్వచ్ఛ పురస్కార్ అవార్డు
- ప్రతి ఏటా అవార్డులు.. ప్రశంసలు

న్యూస్‌టుడే, పూడూరు

విద్యార్థుల పట్టుదల...గ్రామస్థుల తోడ్పాటు, ఉపాధ్యాయులు అంకితభావం...ఇవన్నీ కలిసి ఆ పాఠశాలను ఆదర్శపాఠశాలగా మారుస్తున్నాయి. విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించటంతోపాటు పర్యావరణ రక్షణకు కృషి చేస్తుండటంతో పాఠశాల అంటే ఇలా ఉండాలనిపిస్తోంది. అదే పూడూరు మండలం కంకల్ ఉన్నత పాఠశాల. ఇక్కడ ప్రైవేటుకు ధీటుగా విద్యాబోధన సాగుతోంది. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. వివిధ సందర్భాల్లో అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా మొన్నటి పంద్రాగస్టున కూడా పాఠశాల ఉపాధ్యాయుడు స్వచ్ఛ పురస్కార్ అవార్డును అందుకున్నారు. అటు శుభ్రతలోనూ, ఇటు విద్యారంగంలోనూ తనదైన గుర్తింపు చాటుతున్న ఈ ప్రభుత్వ పాఠశాలపై న్యూస్‌టుడే అందిస్తున్న కథనం.

సకల సౌకర్యాలు

కంకల్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పది తరగతులకు గాను 380 మంది విద్యార్థులున్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులే కాకుండా పక్కనే ఉన్న పుడుగుర్తి, చింతలపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. 17 మంది ఉపాధ్యాయ బృందానికి గాను సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యా పోస్టు ఒక్కటే ఖాళీగా ఉండటంతో ఆ స్థానంలో విద్యావలంటీరును నియమించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఉపాధ్యాయుల సమావేశానికి ప్రత్యేక గది. కంప్యూటర్, సైన్స్ ప్రయోగశాల కోసం వేర్వేరుగా గదులు కేటాయించారు. మరో ప్రత్యేక గదిలో ప్రతి రోజు ఆరు డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఇతర సమయాల్లో విద్యార్థుల కోసం శుద్ధి నీటి పరికరంతో స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కావలసినంత ఆటస్థలం ఉంది. పచ్చటి పాఠశాలగా తీర్చి దిద్ది ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు గాను ఆవరణలో టేకు, ఇప్ప, మద్ది, అల్లనేరేడు వంటి సుమారు 500లకు పైగా వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. బాల బాలికల కోసం వేర్వేరుగా మూత్రశాలలు, శౌచాలయాలు ఉన్నాయి. విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు అప్పట్లో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయం గదిలో సుమారు 3 వేలకు పైగా వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయి. కంప్యూటర్ బోధనకు ప్రత్యేక గదిలో ఇక్కడ 14 వరకు కంప్యూటర్‌లు అందుబాటులో ఉన్నాయి. బాలికల క్యాబినెట్‌తో పాటు మధ్యాహ్నం భోజనం అమలుకు కమిటీలు, ఆరోగ్య కమిటీల ద్వారా విద్యార్థులు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.



ఇటీవలి పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి మహేందర్‌రెడ్డి నుంచి స్వచ్ఛ పురస్కార్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

సాధించిన విజయాలు

- 2016–17లో జరిగిన పదోతరగతి పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థిని మౌనిక 9.7 పాయింట్లు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- పాఠశాలకు చెందిన ఇద్దరు వాలీబాల్, మరో ఇద్దరు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై వైజాగ్, విజయవాడ పట్టణాల్లో ఆడారు.
- జాతీయ ఉపకార వేతనాల పథకానికోసం గత ఏడాదిలో జరిగిన అర్హత పరీక్షల్లో పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- పాఠశాల నుంచి ప్రతి ఏటా జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ కోసం 4 నుంచి 5 గురు విద్యార్థులు ఎంపిక అవుతున్నారు.
- ఇటీవల జరిగిన స్వచ్ఛ పురస్కార్‌కు పాఠశాల ఎంపికైంది. స్వాతంత్ర దినోత్సవం రోజున మంత్రి మహేందర్‌రెడ్డి. జిల్లా పాలనాధికారిణి దివ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు.
- పాఠశాల విద్యార్థులు కనబర్చిన ప్రతిభను గుర్తించి సినీ హీరో అక్కినేని నాగార్జున కొంతమంది విద్యార్థులను నగరంలోని తన స్టూడియోకు పిలుపించుకుని క్విజ్ కాంపిటేషన్‌లో ఉన్న వారి ప్రతిభను తెలుసుకున్నారు.



అందరి సహకారంతోనే గుర్తింపు

– కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

అందరి సహకారంతోనే పాఠశాలకు మంచి గుర్తింపు వస్తోంది. విద్యార్థులు పట్టుదలతో చదువుకోవటంతో పాటు ఉపాధ్యాయ బృందం కూడా అంకిత భావంతో పనిచేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జిల్లా స్థాయి స్వచ్ఛ పాఠశాల అవార్డును ఈ పాఠశాలకు అందించింది

పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

– అమర్‌నాథ్, ఉపాధ్యాయుడు, పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షులు

పాఠశాల ఆవరణలో మంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులకు ఈ విషయై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక చర్యలు తీసుకోవడం వల్లే పాఠశాల పరిసరాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.





యోగా చేస్తున్న విద్యార్థులు

అధికారుల పరిశీలన

ఇక్కడ విద్యార్థులు సాధిస్తున్న వరుస విజయాలు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల పనితీరు దక్కిన గుర్తింపులను పరిగణంలోకి తీసుకుని స్వచ్ఛ విద్యాలయ పురష్కారం కోసం పరిశీలనకు వచ్చింది. దీంతో కేంద్ర మానవ వనరుల శాఖ అధికారుల బృందంతో పాటు సుప్రీంకోర్టు సభ్యుల బృందం పరిశీలనకు వచ్చారు. వివిధ అంశాల్లో వంద పాయింట్లకు గాను పాఠశాల 90 పాయింట్లు సాధించి జిల్లాలోని ఉన్నత పాఠశాలల నుంచి కంకల్ పాఠశాల ఒక్కటే స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డును దక్కించుకుంది.

ఐదేళ్లుగా ఆదర్శం!



పార్వతీ, పరమేశ్వరుడు, వినాయకుని వేషధారణతో చిన్నారులు



గాంధీ చౌక్‌లో మట్టి వినాయకుడు

పరిగి: పర్యావరణ పరిరక్షణకు పలువురు తమవంతు కృషి చేస్తున్నారు. ఎవరైనా రంగు రంగుల వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆరాటపడుతుంటారు. దీనికి భిన్నంగా పరిగిలోని గాంధీచౌక్ వద్ద మండప నిర్వాహకులు మాత్రం వరుసగా గత ఐదేళ్లుగా మట్టి వినాయకుడినే నెలకొల్పి పూజిస్తున్నారు. దీనిని ఆదర్శంగా తీసుకున్న మండలంలోని చిగురాల్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైతం మట్టితో రూపొందించిన వినాయక ప్రతిమను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నం.1 విద్యార్థులు కూడా ఇదే మార్గంలో పయనిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయకుల మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేకంగా భజనలు చేస్తున్నారు. పోటాపోటీగా అన్నదానాలు చేస్తున్నారు.

చౌక దుకాణాల్లో అంగన్‌వాడీ బియ్యం

- త్వరలో బయోమెట్రిక్ విధానం
- జిల్లాలో 1,107 కేంద్రాలకు వర్తింపు



రేషన్ దుకాణం

వికారాబాద్ టౌన్: గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా కావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ప్రతి నెల పౌరసరఫరా గోదాంల నుంచి సరఫరా చేసేవారు. దీంతో రవాణా చేసే వారిపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో పాటు అన్ని సరకులను ఒకరే రవాణా చేయాల్సి రావడంతో కొన్ని సందర్భాల్లో ఆలస్యం అయ్యేది. ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులను అధిగమించేందుకు వచ్చే నెల నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టనున్నారు.

జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 16,802 మంది, గర్భిణులు 5,240 మంది, బాలింతలు 4,265 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెల 520 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అయితే ఇక నుంచి గ్రామాల్లో ఉండే రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు తమకు కేటాయించిన బియ్యాన్ని తెచ్చుకోనున్నారు. దీనివల్ల సమయానికి బియ్యం అందడంతో పాటు ఇబ్బందులు తొలగనున్నాయి.

ఇబ్బందులను అధిగమించేందుకు

స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారిణి జ్యోత్స్న

ప్రభుత్వం గ్రామాలలోని రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని తీసుకునే విధానం ద్వారా ఇబ్బందులు తప్పనున్నాయి. రవాణాకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. సకాలంలో కేంద్రాలకు బియ్యం అందే అవకాశం ఉంది.

సెప్టెంబరు నుంచి అమలు

సెప్టెంబరు నుంచి చౌక ధరల దుకాణాల నుంచి బియ్యం పొందే సౌకర్యం కలుగనుంది. ఇప్పటికే జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి జ్యోష్న కేంద్రాల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయిస్తున్నారు. దీంతో పాటు కేంద్రాలకు పంపిణీ చేసే విధానాన్ని బయోమెట్రిక్ ద్వారా తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. గురువారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలో కేంద్రాలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. త్వరలోనే వికారాబాద్ జిల్లాలో బయోమెట్రిక్ విధానం ద్వారా రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకెళ్లే విధానాన్ని అమలు చేయనున్నారు.



పండుగ సందడి.. జిహ్వాకు కట్టడి

- చవితి నుంచి వరుస వేడుకలే
- తీపి పదార్థాలతో అనారోగ్య ముప్పు
- ఆహారం మోతాదు మించకుండా జాగ్రత్తలు

ఈనాడు, హైదరాబాద్

వినాయక చవితి మొదలుకొని ఒకటి తర్వాత ఒకటి వరుసగా పండుగలే పండుగలు. దసరా, దీపావళి...అనంతరం సక్రాంతి...మధ్య చిన్న చిన్న పండుగలు బోలెడన్ని వస్తుంటాయి. కుటుంబ సభ్యులు, బంధువులతో ఒకటే సందడి. చిన్నా పెద్దా అందరికీ నోరూరించేవి పిండి వంటలే. నేతితో చేసిన గారెలు, బూరెలు, లడ్డూలు...ఇలా ఎన్నో రకాలు...జిహ్వాచాపల్యంతో చాలామంది వీటిని లాగించేస్తుంటారు. ఈ సందడిలో ఎంత తింటున్నారో కూడా మరిచిపోతుంటారు. అప్పటివరకు పాటించిన ఆహార నియమాలన్నీ గాలిలో కలిసిపోతాయి. ఈ రోజుల్లో మితిమీరి తినడం వల్ల శరీరంలోకి మళ్లీ కేలరీలు పోగవుతాయి. పండుగ అంటే పిండి వంటల రుచి చూడాల్సిందే. బెల్లంతో చేసిన అరిసెలు, నేతితో చేసిన మురుకులు, సకినాలు లాంటి సంప్రదాయ వంటలు చిన్నపిల్లలకు ఆరోగ్యకరమే.. అదే పెద్దవాళ్ల విషయంలో మాత్రం కాస్త జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మధుమేహం, హృద్రోగ సమస్యలతో ఉన్నవారు నూనె, నెయ్యి, చక్కెర అధిక మోతాదులో ఉన్న పిండి వంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

మద్యపానం ప్రమాదమే...

మద్యపాన ప్రియులు పండుగ పేరు చెప్పి స్నేహితులు, బంధువులతో మందు పార్టీల్లో మునిగి తేలుతుంటారు. ఇలా జీర్ణ వ్యవస్థను ఒక్కసారిగా మార్పునకు గురిచేయడం వల్ల ఒక్కోసారి వాంతులు అవడం, కడుపునొప్పి లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఊబకాయం, డయాబెటిస్, గుండె జబ్బులు ఉన్నవారు...పండగ పేరుతో అతిగా మద్యం తాగడం, నూనెతో చేసిన పదార్థాలు మితిమీరి తినడంతో దాని ప్రభావం కాలేయంపైనా పడుతుంది. మద్యం అతిగా తీసుకుంటే కొన్నిసార్లు శరీరంలో చక్కెర స్థాయిలు తగ్గిపోతాయి. కొంతమందికి గాల్ బ్లాడర్ సమస్య, కడుపుబ్బడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పండుగ హడావుడిలో వేళాపాళా లేకుండా కొందరు భోజనాలు చేస్తారు. రోజూ తినాల్సిన సమయానికి కాకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. కొందరిలో రక్తపు వాంతులు అవుతాయి. కొన్నిసార్లు వాంతి అయిన పదార్థం ఊపిరితిత్తుల్లోకి చేరితే ఊపిరి తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. గుండె నొప్పి, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి తీవ్ర పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



ఈ నియమాలు పాటించాలి..

- సాధ్యమైనంత వరకు ఇంటిలో తయారు చేసిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఊబకాయం, మధుమేహం, హృద్రోగ సమస్యలు ఉన్నవారు ఎంత తక్కువ మోతాదులో తీసుకుంటే అంత మంచిది.
- పిండి వంటల్లో చక్కెర తక్కువ మోతాదులో ఉన్నవి...పీచు ఉన్న పదార్థాలు మంచిది. అవి కూడా తక్కువ మోతాదులో తీసుకోవాలి.
- పండగ రోజుల్లో అతిథుల రాక ఎక్కువ. మర్యాద కోసం పిండి వంటలు, స్నాక్స్ పెడుతుంటారు. వారితోపాటు మనమూ కూర్చొని తినడం వల్ల మనకు తెలియకుండానే ఎక్కువ మోతాదులో కాలరీలు శరీరంలోకి చేరతాయి.
- రోజూ మాదిరిగానే ఉదయం వేళకు అల్పాహారం, భోజనం తీసుకోవడం వల్ల ఒకవేళ అతిథులు వచ్చినా...వారితోపాటు మనం తినకుండా ఉండేందుకు వీలుంటుంది.
- చక్కెరతో చేసిన పదార్థాలను కళ్లకు కన్పించేటట్లు పెట్టడం వల్ల జిహ్వాచాపల్యం వేధిస్తుంది. వాటిని డబ్బాల్లో పెట్టి ఉంచాలి.
- పిండి పదార్థాలకు బదులు... మంచి పండ్లు, సలాడ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు ఇతర చిరు తిళ్లపై మనసు మళ్లదు.
- కొంచెం పిండి వంటలు తిన్నా సరే...వాటిని చాలా నెమ్మదిగా తినాలి. దీనివల్ల ఎక్కువ తినేందుకు ఆస్కారం ఉండదు.

సాంకేతిక విద్యాక్షేత్రంలో.. క్రీడా ప్రాంగణం

- రూ.12.9కోట్లతో జీప్లస్2గా ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఇప్పటికే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదముద్ర
- జేఎన్‌టీయూలో అర ఎకరంలో నిర్మాణానికి కసరత్తు



ఇండోర్ స్టేడియం కోసం ప్రతిపాదించిన స్థలం ఇదే

అదొక సాంకేతిక విశ్వ విద్యాలయం.. వందలాది ఇంజినీరింగ్ కళాశాలలకు మార్గనిర్దేశం చేసేది అక్కడి నుంచే.. వేలాదిమంది విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తుంటారు... అలాగని విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ తమ సత్తా చాటి వర్సిటీకి వన్నె తీసుకొస్తున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు... క్రీడా పోటీలు నిర్వహించేందుకు మాత్రం బయటి మైదానాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇప్పటివరకు అక్కడ క్రీడాపరంగా మైదానం లేకపోవడంతో అరకొర సదుపాయాలతో నెట్టుకొస్తున్నారు. ఇక్కడి అవసరాలు.. క్రీడలను ప్రోత్సహించేందుకు కావాల్సిన ఏర్పాట్లకు సంబంధించి కొన్నేళ్లుగా క్రీడా విభాగంనుంచి ఉప కులపతులకు వినతులు వెళుతూనే ఉన్నాయి. వాటికి ఊ కొడుతున్నారే తప్ప తరువాత పట్టించుకున్నవారు లేకుండాపోయారు. ఎట్టకేలకు ఇందుకు కసరత్తు మొదలైంది.

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో ఇంజినీరింగ్, ఇతర పీజీ కోర్సులకు సంబంధించి మొత్తం దాదాపు 4వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సాంకేతిక విద్యలో మార్గనిర్దేశం చేయడమే కాదు.. మార్గదర్శకులుగా ఉండాలని ఇటీవల వర్సిటీలో పీజీ వసతిగృహం ప్రారంభించిన సందర్భంగా మంత్రి కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకొని క్యాంపస్‌ను తీర్చిదిద్దాలని చెప్పారు. వాస్తవంగా ఇప్పటివరకు వర్సిటీలో క్రీడాపరంగా బయటికి చెప్పుకొనేంతగా సదుపాయాలు లేవనే చెప్పాలి. క్రీడా కాంప్లెక్స్ ఉన్నా అరకొర ఏర్పాట్లతోనే కొనసాగుతోంది. ఏటా వర్సిటీనుంచి వందలాది మంది విద్యార్థులు అంతరవర్సిటీ క్రీడా పోటీలు, రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ క్రీడా పోటీలకు హాజరై సత్తా చాటుతుంటారు. ఇక ఇక్కడ ఏదైనా టోర్నమెంట్ నిర్వహించాలంటే ఏర్పాట్లు సరిగా లేక ఇబ్బందులు పడుతూవస్తున్నారు. దీన్ని అధిగమించేందుకు ఎట్టకేలకు ముందడుగు పడింది.

ఆమోదం లభించిందిలా..

విశ్వవిద్యాలయంలో అంతర క్రీడా మైదానం కోసం ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. క్రీడా విభాగం అధికారులు పదేళ్లుగా వచ్చిన ప్రతి వీసీకి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. ఆమోదం మాతకనం ఎవరూ ఇవ్వలేదు. ఇటీవల మరోసారి ప్రతిపాదనను ప్రస్తుత ఉపకులపతి వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. దీనిపై చర్చించిన ప్రతినిధులు అంతర మైదానం నిర్మాణం అవసరమని గుర్తించి ఆమోదముద్ర వేశారు. దీనికి సంబంధించి మినిట్స్ విడుదల కావాల్సి ఉంది. అది రాగానే అధికారికంగా వర్సిటీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రంగంలోకి దిగుతారు. ముందుగా కన్సల్టెన్సీతో డిజైన్ తయారుచేయించి తర్వాత టెండర్లు పిలుస్తామని. ఆ వెంటనే నిర్మాణానికి శ్రీకారం చుడతామని ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ లక్ష్మణరావు తెలిపారు. వర్సిటీలో అంతర మైదానం అవసరమని గుర్తించడంతోనే ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

నిర్మాణం జరిగేది ఇలా..

ఇప్పటికే విశ్వ విద్యాలయం ఆవరణలో అంతర మైదానం కోసం స్థలాన్ని గుర్తించారు. ప్రస్తుత క్రీడాకాంప్లెక్స్ పక్కనే ఉన్న దాదాపు ఎకరం స్థలంలో అర ఎకరానికిపైగా దీని కోసం కేటాయించారు. ఇక్కడ బోర్డు కూడా పాతారు. దానిపై ప్రతిపాదిత ఇండోర్ స్టేడియం అని రాసి ఉంచారు. ఈ స్థలంలో జీ ప్లస్‌టు అంతస్థుల్లో అంతర మైదానం నిర్మాణం జరుగుతుందని ఈఈ చంద్రశేఖర్, పీడీ గోపీకృష్ణ వివరించారు. తొందరలోనే నిర్మాణం ప్రారంభించే అవకాశముందని పేర్కొంటున్నారు. రూ. 12. 9కోట్ల కేటాయింపునకు ఈసీ ఆమోదం లభించడంతో తొందరలోనే మరో అడుగు ముందుకు పడే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

క్రీడా ఏర్పాట్లు ఇవీ..

అంతర మైదానంలో షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు నాలుగు చొప్పున 8ఉంటాయి. షటిల్ కోర్టులు మల్టీపర్పస్‌లో వాడుకునేలా రూపొందించనున్నారు. అవసరమైనప్పుడు వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడుకునే అవకాశం ఉంటుంది. విశాలమైన టీటీహాల్స్, మహిళలు, పురుషులకు వేర్వేరుగా అధునాతన వ్యాయామశాలలు, క్యారమ్స్, చెస్ ఆడుకునేందుకు ప్రత్యేక గదులు, యోగా కేంద్రం, స్క్వాష్ రాకెట్, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఒక హాల్ ఉంటాయి. వీటితో పాటు 500మంది క్రీడాకారులు వసతి పొందేలా ప్రత్యేక గదులు, హాళ్లు, మేనేజర్లు, శిక్షకుల కోసం ప్రత్యేక వసతి సౌకర్యం, కాన్ఫరెన్స్‌హాల్, పీడీ ఆఫీసుతో పాటు అన్ని ఏర్పాట్లు ఇందులో ఉంటాయి. ఈత కొలను కోసం కూడా ప్రతిపాదన సిద్ధమవుతోందని పీడీ గోపీకృష్ణ వివరించారు. రాబోయే రోజుల్లో విశ్వ విద్యాలయంలో క్రీడాపరంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.





ఒక్క ట్వీట్ చాలు..!

పోకిరీలపై పోలీస్ దూకుడు

పెరుగుతున్న ఫిర్యాదుల సంఖ్య

యువతులు.. విద్యార్థినులకు దన్ను

ఈనాడు, హైదరాబాద్

'ఒక్క ట్వీట్ చాలు.. పోకిరీలను పట్టేస్తాం'.. ఇది హైదరాబాద్ పోలీసుల తాజా విధానం.. విద్యార్థినులు.. మహిళలను వేధిస్తోన్న వారిని అరెస్ట్ చేసేందుకు వీలుగా నగరంలోని ప్రతి పోలీస్ ఠాణా ఇన్‌స్పెక్టర్ పేరుతో ట్విట్టర్ ఖాతాలను తెరిచారు. బాధితులెవరైనా సరే ట్విట్టర్‌లో తమ ఆవేదన తెలిపిపే చాలు... వెంటనే స్పందిస్తున్నారు. 'షి' బృందాలతో పాటు శాంతి భద్రతల పోలీసులూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుని తాట తీస్తున్నారు. వేలమంది విద్యార్థినులు, మహిళలు ట్విట్టర్‌ను వినియోగిస్తుండడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధితులు లేదా సమాచారం ఇచ్చేవారు ట్విట్టర్ ద్వారా వేధింపుల సమాచారం ఇస్తే చాలు... రహస్యంగా అక్కడికి వెళ్లి పోకిరీలను అరెస్ట్ చేస్తున్నారు. కొద్దిరోజుల వ్యవధిలోనే 126మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. తీవ్రత ఆధారంగా కేవలం ట్విట్టర్, వాట్సాప్ ఫిర్యాదుల ద్వారా కేసులు నమోదు చేస్తున్నారు.



సామాజిక మాధ్యమాలు.. లఘుచిత్రాలు

మెట్రో నగరాల్లో మహిళలకు వేధింపులు క్రమంగా పెరుగుతున్నాయి. పోకిరీలు, రౌడీలను ఎదిరిస్తే పరువు పోతుందన్న భావనతో బాధితులు వేధింపులను మౌనంగా భరిస్తున్నారు. చట్టం వీరికి రక్షణగా ఉన్నా పోలీసులంటే భయం కారణంగా వారికి ఫిర్యాదు చేయలేక పోతున్నారు. రెండేళ్ల క్రితం 'షి'బృందాలు ప్రారంభమయ్యాక పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. కొందరు 'షి'బృందాలకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు వేధింపులపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతో అవగాహన పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, బస్‌స్టాప్‌లు, బస్సులు, మహిళా వసతి గృహాలు, షాపింగ్‌మాల్స్‌లో 'షి' బృందాల సభ్యులు వెళ్లి మహిళలతో మాట్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కరపత్రాలు ఇస్తున్నారు. పోస్టర్లు, స్టిక్కర్లు అంటిస్తున్నారు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద డిజిటల్ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వేధింపులు ఎదుర్కోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని వారిని చైతన్య పరిచేందుకు లఘుచిత్రాలను రూపొందించారు. వాస్తవిక ఘటనల స్ఫూర్తితో వీటిని చిత్రీకరించారు. చరవాణులు వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో వాట్సాప్, ట్విట్టర్ ద్వారా కూడా ఫిర్యాదులు చేసే వెసులుబాటును కల్పించారు. ప్రచారం నిర్వహించినప్పటి నుంచి క్రమంగా ఫిర్యాదులూ పెరుగుతున్నాయి.

వెంటపడి.. భయ పెట్టి.. వేధించి...

వేధిస్తున్నవారిని పట్టుకునేందుకు 'షి' బృందాలు పనిచేస్తున్నా.. చరవాణులు, అంతర్జాల ఆధారిత నేరాలకు పాల్పడేవారు విద్యార్థినులు, మహిళలు ఇంకా వేధిస్తూనే ఉన్నారు. తెలిసిన వారున్నా లేకపోయినా.. కేవలం ఫోన్ నంబరుంటే చాలు అసభ్యంగా మాట్లాడుతున్నారు. బాధితులు మాట్లాడక పోయినా, నంబరు గుర్తించి సమాధానం ఇవ్వకపోయినా వేర్వేరు నంబర్లతో ఫోన్ చేసి భయపెడుతున్నారు. పైశాచిక మనస్తత్వం ఉన్న కొందరు నేరగాళ్లు బూతులు తిడుతున్నారు. అసభ్య, అశ్లీల వీడియోలను చరవాణులకు పంపుతున్నారు. మరికొందరు అర్ధరాత్రి దాటాక ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు విరామం లేకుండా ఫోన్లు చేస్తూ హింసిస్తున్నారు. ఇలాంటి చిత్రహింసలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు వైద్యులు కూడా ఉన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా మారువేషాల్లో ఉండే 'షి'బృందాలు పట్టుకుంటాయి. ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో వేధిస్తే బాధితులు ఫిర్యాదు చేస్తేనే తప్ప పోలీసుల దృష్టికి సమస్య రాదు. బాధితుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని కొందరు నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. బాధితుల చిరునామాలను సేకరించాక వెంటాడి, వేధిస్తున్నారు. దీనిపై బాధితులు మిన్నకుండి పోతుండడంతో ఇంకా కొనసాగుతోంది.

బాధితులిలా... (శాతాల్లో)

13-18 ఏళ్లు:	15
18-25 ఏళ్లు:	60
25-35 ఏళ్లు:	20
35-45 ఏళ్లు:	05

అత్యంత గోప్యం.. సాంత్వన..

చరవాణులు, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్న వారి కోసమే వాట్సాప్, ట్విట్టర్ సేవలను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. నిందితులు మాట్లాడిన మాటలు(రికార్డు చేసుంటే), అసభ్య సందేశాలు, వీడియోలను వాట్సాప్, ట్విట్టర్ ద్వారా పంపితే చాలు. మిగిలిన వ్యవహారమంతా 'షి' బృందం సభ్యులు చూసుకుంటారు. బాధితులు ఎవరికీ చెప్పుకోలేక మధనపడి కుంగి పోకూడదన్న భావనతో ఈ సౌకర్యాన్ని కల్పించారు. బాధితుల వివరాలను పోలీసులు మాత్రమే తీసుకుని వారి పేర్లు ఎక్కడా బహిర్గతం కాకుండా గోప్యత పాటిస్తున్నారు. బాధితుల చరవాణుల నుంచి కాకుండా ఇతర చరవాణుల నుంచి ఫిర్యాదు చేసినా సరే వారితో మాట్లాడి వివరాలు సేకరించి వెంటనే కేసు నమోదు చేస్తున్నారు. ఇంతేకాదు... ట్విట్టర్ ద్వారా పోస్ట్ చేసిన వెంటనే బాధితులతో మాట్లాడి నిందితులు ఎక్కడున్నారు? ఏంచేస్తున్నారన్న వివరాలు అడిగి ఒకవేళ సమీపంలోనే నిందితులుంటే వారిని వెంటనే అదుపులోకి తీసుకునేందుకు వీలుగా అక్కడున్న 'షి'బృందాలకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు బాధితులకు భరోసా ఇస్తుండడం, గోప్యత పాటిస్తుండడంతో క్రమంగా ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందని, ఆరునెలల్లో ట్విట్టర్ ద్వారా 450 ఫిర్యాదులు వచ్చాయని పోలీస్ అధికారులు వివరించారు.



రంగధాముని చెరువు

'నాణ్యత'కు నీళ్లొదిలారు..!

- చెరువులను పరీక్షించడంలో పీసీబీ అలసత్వం
- 185 చెరువులుంటే.. 20లోనే నాణ్యత పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్



కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి బెంగళూరులోని నీటి వనరుల పరిస్థితిపై ఓ ప్రత్యేక అధ్యయనం చేసింది. 67 చెరువుల్లోని నీరు తాగేందుకు పనికి రావని తేల్చింది. . చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

మరి.. మన పీసీబీ అధికారులు ఏం చేస్తున్నారో తెలిస్తే ముక్కున వేలేసుకోకమానరు.. ప్రత్యేక అధ్యయనాల సంగతి దేవుడెరుగు.. చెరువులు, కుంటల్లోని నీటి నాణ్యతను పరీక్షించడంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారు.. ఎందుకిలా అంటే సిబ్బంది కొరత, నిధుల లేమిని సాకుగా చూపిస్తున్నారు. కనీసం కాలుష్యపు నురుగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నగరవాసుల కష్టాలనైనా చూసి అడుగు ముందుకేయాల్సిన అవసరముందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

కాలుష్య కాసారాలుగా..

నేషనల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రాం(ఎన్‌డబ్ల్యూఎంపీ) కింద పీసీబీ గ్రేటర్‌లోని 20 చెరువుల్లో నీటి నాణ్యతను పరీక్షిస్తోంది. ఇందుకయ్యే వ్యయంలో కొంత మొత్తాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి భరిస్తుంది. ఆ జాబితాలో హుస్సేన్‌సాగర్, ఫాక్స్ సాగర్, హస్మత్‌పేట్, రంగధాముని చెరువు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, నల్ల చెరువు, సరూర్‌నగర్ చెరువు, నూర్ మహమ్మద్ కుంట, నల్ల చెరువు, మల్లాపూర్ ట్యాంక్, నాచారం పెద్ద చెరువు, సఫిల్‌గూడ చెరువు, సరూర్‌నగర్ చెరువు, రాజేంద్రనగర్‌లోని నూర్ మహమ్మద్ కుంట, ప్రేమాజీపేట తదితర నీటి వనరులు ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా చెరువుల నుంచి క్రమం తప్పకుండా నీటి నమూనాలను సేకరించి పీహెచ్, టోటల్ డిసాల్వ్‌డ్ సాలీడ్స్(టీడీఎస్), డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో), నైట్రేట్, బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), ఫాస్ఫేట్, బోరాన్, కోలిఫాం కాలుష్య ఉద్గారాల తీవ్రత స్థాయిని లెక్కిస్తారు. ఆ గణాంకాల ఆధారంగా నీటి వనరులు కలుషితమయ్యాయా.. వాటి పరిస్థితేంటో పరిశీలిస్తారు. ఈ 20 చెరువుల్లో ఒకటి, రెండు మినహా మిగిలినవన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి.

ప్రతిపాదనలేవీ..?

చెరువుల నగరంగా భాగ్యనగరం ప్రసిద్ధి. ప్రతి 2.5 కిలోమీటర్ల విస్తీర్ణానికి ఒక చెరువు ఉన్న నగరం మనది. జీహెచ్‌ఎంసీ పరిధిలోనే సుమారు 20 ఎకరాల విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న చెరువుల సంఖ్య 160కి పైగా ఉన్నట్లుగా పర్యావరణ వేత్తలు స్పష్టం చేస్తున్నారు. 'పీసీబీ మాత్రం 20 చెరువుల్లోనే నీటి నాణ్యతను పరీక్షిస్తుంది.. సీపీసీబీ నిధులు ఇస్తుంది కనుక తప్పని సరి పరిస్థితుల్లో వాటిని పట్టించుకుంటున్నారు. లేకపోతే.. అటువైపు చూడకపోయేవాళ్లు' అని విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా సిబ్బంది కొరత, నిధుల లేమితోనే ఇతర చెరువులపై దృష్టి సారించడం లేదని పీసీబీ అధికారులు వివరిస్తున్నారు. వాస్తవానికి ప్రతి నెలా ఒక్కో చెరువులో నీటి నాణ్యతను పరీక్షించాలంటే నమూనాల సేకరణ, అనాలిసిస్‌కు సుమారు రూ.5వేల వరకు ఖర్చవుతుంది. ఇందులో సగానికంటే ఎక్కువే సీపీసీబీనే భరిస్తుంది.. సిబ్బంది కొరత విషయానికొస్తే.. ప్రతి నెలకు ఒకసారి మాత్రమే నీటి నమూనాల్ని సేకరిస్తారు. కాబట్టి ఉన్నవాళ్లతో ఇబ్బందేం ఉండదు. సీపీసీబీ అనుమతితో కొత్తగా ఇంకొన్ని నీటి వనరులను జాబితాలో చేర్చేందుకు అవకాశముంది. కాకపోతే.. మన పీసీబీ అధికారులు మాత్రం ఆరేళ్ల నుంచి ఇంత వరకు ప్రతిపాదనల్ని పంపలేదు.

సమన్వయం అవసరం

శనివారం కూకట్‌పల్లిలోని ధరణీ కాలనీవాసులు పక్కనే ఉన్న పరికిచెరువు నుంచి వెలువడిన కాలుష్యపు నురగతో నరకం చూశారు. ఇక్కడే కాదు రెండు నెలల వ్యవధిలో 5 చెరువుల్లోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికీ అప్రమత్తం కాకపోతే భాగ్యనగరమంతా ఇదే పరిస్థితి ఖాయమని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను పరీక్షించి.. చేయి దాటిపోయిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందంటున్నారు. అన్ని కాకపోయినా కనీసం ముఖ్యమైన వాటినైనా జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ఎలాగూ వ్యయాన్ని భరించే ఆర్థిక స్థోమత కాలుష్య నియంత్రణ మండలికి ఉందని.. సిబ్బంది కొరతను అధిగమించేందుకు జేఎన్టీయూ, ఉస్మానియా తదితర విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని సూచిస్తున్నారు.

పర్యావరణహితంగా పరిశ్రమలు కొనసాగాలి

హైదరాబాద్: పర్యావరణ హితంగా పరిశ్రమలు కొనసాగాలని, విద్యుత్, నీరు వంటి వనరులను పొదుపుగా వినియోగించుకునేందుకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు పారిశ్రామిక వేత్తలు పేర్కొన్నారు. బుధవారం సీఐఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో 16వ ఎనర్జీ ఎఫిషియన్సీ సమ్మిట్‌ను ప్రారంభించారు. పేపర్‌టెక్, గ్రీన్ షుగర్ సమ్మిట్, పవర్‌ప్లాంట్ సమ్మిట్‌ల పేరిట కాగితం, చెక్కర, విద్యుత్ పరిశ్రమలకు సంబంధించి వేర్వేరు అంశాలపై చర్చించారు. ఆయా రంగాల నిపుణులు హాజరై తమ కంపెనీల్లో అనుసరిస్తున్న పర్యావరణహితమైన చర్యలు, విద్యుత్‌పొదుపు విధానాలను వివరించారు. 150 కంపెనీలనుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా అంశాలపై సదస్సులో పత్రాలను సమర్పించారు. పర్యావరణ పరంగా వస్తున్న సవాళ్లను ఎదురుకునేందుకు కాగితం పరిశ్రమలు మెరుగైన విధానాలను అవలంబించాల్సిన అవసరముందని వివరించారు. కార్యక్రమంలో షుగర్ టెక్నాలజీస్ అసోయేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ అవస్తి, టాటా పవర్ కంపెనీ చీఫ్ సీటీడీఎస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతిభ

Generally, the aim of a student joined in Intermediate Bi. P. group is to secure a seat in a reputed Medical College to study M.B.,B.S. or other allied Medical Course. To get a seat in M.B.,B.S. one has to face the National Eligibility Entrance Test (NEET) and secure a good rank. Hence, while preparing for Intermediate Public Examination (IPE), critical, analytical and planned study is required.

Tips to tap good score...

Junior Inter STUDY PLAN

Zoology

In IPE, the Zoology Paper is for 60 marks. Out of the 60 marks, 20 marks are allocated for Very Short Answer Questions [VSAQ : 10 questions × 2 marks], 24 marks are allotted for Short Answer Questions [SAQ : 6 questions × 4 marks] and 16 marks for Long Answer Questions [LAQ : 2 questions × 8 marks]. The syllabus of Zoology is divided into 8 Units. Weightage (approximate) of Marks for each unit is given below:

S. No.	Unit	Marks Allocated
I	Diversity of Living World	06
II	Structural Organisation in Animals	10
III	Animal Diversity - I (Nonchordates)	06
IV	Animal Diversity - II (Chordates)	06
V	Locomotion and Reproduction in Protozoans	08
VI	Biology in Human Welfare	14
VII	*Periplaneta americana* (Type Study)	12
VIII	Ecology and Environment	14

- As there is no choice for VSAQ, all questions should be answered. To answer these questions, all topics are to be understood clearly, read thoroughly and remember the subject matter. Answer for these questions must be direct and brief. For example...

  Q. A person is suffering from bowel irregularity and abdominal pain. His stools contains blood and mucus. Based on these symptoms, name the disease and the causative organism.

  Ans. a. Disease : Intestinal amoebiasis / Amoebic dysentery.

  b. Causative organism: *Entamoeba histolytica*

- Eight SAQ will be given. One has to answer any six in 15-20 lines each. Some questions are related to drawing the diagram and labelling also. Answer for some SAQ may not be in 20 lines and for some, it may be more than 20 lines. Hence, do not count the number of lines. Write the perfect and complete answer. If diagram is asked, draw it with a sharply pointed pencil and label the parts towards right side. If space is not sufficient, write on left side also. Generally diagrams are asked from the units II and VII.
- Regarding LAQ, three questions will be given. You have to answer any two which are familiar to you. Each answer should be in 45-60 lines. Illustrations are also necessary for these questions. This type of questions are selected from the units II, VI, VII and VIII.

Important...

- *Generally for IPE, the questions for public examination are selected from the list of questions given at the end of each unit of BIE / Telugu Akademi Text Book.*
- *While preparing a unit, first read LAQ. They cover some SAQ and VSAQ.*
- *Then read remaining SAQ. They cover some VSAQ. Then read the remaining VSAQ.*



Writer:
K. Sreeramulu
Subject Expert

Syllabus and Questions

I. Zoology - Diversity of Living World

- ★ Generally a two marks question will be given from this unit from branches of Zoology, species, nomenclature etc.
- ★ Four marks question is generally given from basic concepts of classification, species concept and biodiversity.

II. Structural Organisation in animals

- ★ From the topics symmetry-types, body cavity-types two and four marks questions are common. From animal tissues, two and four marks, diagram related questions and sometimes eight marks question may be asked.

III. Animal Diversity - I


- ★ This unit is related to the characters and classification of non-chordates. Two and four marks questions are asked from this unit.
- ★ To study the characters, classification; characters of different classes and examples - one has to prepare tables with the help of your text book. Hence, it becomes easy to remember the features and examples.

IV. Animal Diversity - II


- ★ From this unit two and four marks questions are asked from the characters, classification and examples of chordates.
- ★ As in unit III, prepare tables with the help of your text book. So that it becomes easy to remember the things.

V. Locomotion and reproduction in protozoans

- ★ Generally two and four marks questions will be given from this unit.
- ★ Prepare tables regarding locomotory organelles and examples of protozoans and study them.
- ★ Study the mechanisms of locomotion.
- ★ Practice the diagrams of *Euglena* and *Paramoecium*.
- ★ Read the transverse and longitudinal binary fission and definition of conjugation.



Euglena




Paramoecium

VI. Biology in Human welfare


- ★ As more marks are allocated to this unit, concentrate much on this unit.
- ★ Study the types of parasites, hosts, effects of parasites on their hosts thoroughly.
- ★ Keep special attention on structure, life history and pathogenecity of *Entamoeba histolytica, Plasmodium, Ascaris* and *Wuchereria.*
- ★ Also study the symptoms, causative organism and control of typhoid, Pneumonia, common cold and ring worm disease besides TDA abuse.
- ★ All the three types of questions will be given in this unit.

VII. *Periplaneta americana* (Cockroach)

- ★ This unit contains structure, locomotion and body systems of cockroach.
- ★ From the body systems eight marks question may be asked.
- ★ Practice all diagrams thoroughly for a four marks question.
- ★ As this unit is also allocated by more marks, much attention is needed.



Salivary glands of Cockroach



Mouth parts of Cockroach

VIII. Ecology and Environment

- ★ Like units VI and VII, for this unit also more marks are allotted. At the same time, quantity of subject matter is also more.
- ★ As all the topics are related the activities going on around us, understanding these topics is very easy and interesting also.
- ★ Different definitions, abiotic factors in ecosystem and their effects on organisms; population interactions, adaptations, food chains, food web, energy flow, nutrient cycles, pollution etc. need special attention.
- ★ All the three types of questions will be given in this unit.
- ★ While reading concentrate your mind on the Lesson. Victory is yours.

Remember...

- ✓ You have to read more and more. To acquire good knowledge on particular topics you have to read more. Make note of points of what you read. Because it's all about Latin and Greek terms and terminologies in Zoology.
- ✓ Get the latest edition of Zoology Text Book Published by the Telugu Akademi / Board of Intermediate Education for reference and thorough study of the topics.
- ✓ You have to practice a much. Write the answers again and again. It seems laborious and old fashioned but one advantage through practice is you can improve your writing skills and your writing speed increases.
- ✓ An important aspect in Zoology is diagrams. Diagrams are the key factors during your exam preparation. If you study a topic straight, you might not understand it, but with diagram, the same concept can understood well. And during exams, one method which would more appropriate is, draw the diagram first, you can explain the concept easily referring to the diagram, chances of missing the points will be less.
- ✓ Develop patience. Every concept cannot be easily understood. If any concept is taking more time, leave it and begin with easy one. It will build your confidence and you can take on the earlier concept with ease.
- ✓ Start preparing as early as possible. Do not wait till the end. Opening the book at the last moment makes you panic and results in great disappointment.

Send your feedback to
pratibhadesk@eenadu.net

For Tenth, Intermediate Study material please visit...
www.eenadupratibha.net

ప్రతిభ

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ



రచయిత
సీహెచ్. వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.
బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.
సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.
డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.
ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.
ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.
జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.
హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.
ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండు సార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాలు, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాల్లాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్ఠం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.
బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.
సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.
బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.
సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.
డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.
ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు

భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.
ii) దిగుమతుల సరళీకరణ.
iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.


ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పురోగమన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.

హాయ్! బుజ్జీ!!

> జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
> – గౌతమ బుద్ధుడు



వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?



పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!

■ ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ మరి పేరేంటీ? ఊరేంటీ?

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు.

ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ మరి మనం చూడలేమా?

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!



బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

– డి. శ్రీలత, హైదరాబాద్

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!

– మా.శ్రీ. రాజు, పాల్వంచ

చిలిపి ప్రశ్న


తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో ఉంటుంది?


– ఆర్. శ్యామల, హైదరాబాద్

కవలలేవి?

a 

b 

c 

d 

సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.


2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2


రాయగలరా?

ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి
3. ఎలుక 4. పాము
5. గుడ్లగూబ 6. గాడిద

దారేది?





ప్రశ్న: హరికేన్, టైఫూన్, సైక్లోన్, తుపాన్ల మధ్య తేడాలేమైనా ఉన్నాయా?
– టి. రజని, దేవరపల్లి

హరికేన్, తుపాన్ల మధ్య తేడాలేంటి?

జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరిత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

– ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

జవాబులు: రాయగలరా: 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey దాగిన పదం: Season కవలలేవి: a, c చిలిపిప్రశ్న: అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

సుడోకు:

2	5	1	4	3	9	7	8	6
8	4	6	1	5	7	9	2	3
9	7	3	8	6	2	4	5	1
4	2	9	7	8	1	6	3	5
3	1	8	5	9	6	2	4	7
5	6	7	2	4	3	1	9	8
7	8	4	6	2	5	3	1	9
6	9	2	3	1	8	5	7	4
1	3	5	9	7	4	8	6	2

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

మర్పల్లి, న్యూస్‌టుడే: మొక్కల సంరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలని వ్యవసాయ అధికారిణి వసంత అన్నారు. హరితహారంలో భాగంగా మండలంలోని రావులపల్లి, కల్కోడ గ్రామాల్లో టేకు మొక్కల వేర్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మొక్కలు పెంచుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రైతులు పొలాల గట్లు, బీడు భూముల్లో మొక్కలు నాటుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మొక్కలు నాటడంతో వర్షాలు సకాలంలో కురుస్తాయన్నారు. సాగు, తాగు నీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి కలమలమ్మ, రైతులు, గ్రామస్థులు ఉన్నారు.



టేకు వేర్లను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారిణి వసంత

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

దౌల్తాబాద్: ఉపాధ్యాయ ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీమప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి కాంట్రిబ్యూటరి పెన్షన్ పథకం అమలు చేయడం ద్వారా ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లితుందన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి హఠాన్మరణం పాలైతే ఈపథకం ద్వారా ఆ కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. నూతన పింఛను విధానాన్ని రద్దు చేసేందుకు సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాకు అందరూ హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఊషన్న, సాయిలు, రాజు, రాములు తదితరులున్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: పాడుతా తీయగా...** (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు 'వంకాయ బజ్జీ కూర', మీచేతి వంట 'పెసల పులావ్', 'మేథి క్యారెట్ ఫ్రై', జస్ట్ ఎ మినిట్ 'బేసిన్ బర్ఫీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్లా మజాకా:** రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్

సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్వని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చిట్టి చెగోడీలు & పులిహోర, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – స్వీట్ పన్నీర్ బుర్జీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) – డైజెస్టివ్ డ్రింక్, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - గన్ పౌడర్ & ఇడ్లీ, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – రామ్ లడ్డూ, మ.12.30, రా.8.45: "కా అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ప్రాన్స్ అండ్ బేబికార్న్ కట్‌లెట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్డ్ క్యూసైన్) – లాంబ్ స్కీవర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - చికెన్ మిర్చి బజ్జీ, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – కోల్హాపూరి పన్నీర్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ చీజ్, మ.5.15: స్నాక్స్ - పన్నీర్ చీజ్ తవ రోటీ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్నాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందే హాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా., 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: రాజా రాణి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: అందరివాడు, **సాయంత్రం:** 05-30 ఓకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ గోదావరి మొగుడు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

పత్తిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు

తెలంగాణలో ఖరీఫ్‌లో పత్తిని ప్రధాన పంటగా లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. జూన్ మొదటి పక్షం నుంచే ఈ పంటను విత్తుకున్నారు. ప్రస్తుతం పైరు పలు దశల్లో ఉంది. ప్రతికూల పరిస్థితుల్లో పత్తి పైరుపై తొలి దశలో ఆశించేచీడపీడలతో నష్టం ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణ, ఎరువుల వాడకం వివరాలను నిర్మల్ జిల్లా భైంసా వ్యవసాయ సహాయ సంచాలకుడు అమరేశ్‌కుమార్ వివరించారు.

★ ఇటీవలి వర్షాలకు నేలలో తేమ పెరిగి, మొక్కలు వడలిపోతున్నాయి. నల్లరేగడి భూముల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. దీనిని అధిగమించేందుకు తోటలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలి. ఒక లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ గాని, 2 గ్రాములు రిడోమిల్ గాని కలిపి మొక్కల వేర్లు తడిచేలా మొదళ్ల వద్ద పిచికారి చేయాలి.

రసంపీల్చే పురుగులు..

★ చేలో పేనుబంక ఆశించిన మొక్కలు 10-20 శాతం, పచ్చదోమలు ఆకుకు 2, తెల్లదోమలు 20, తామర పురుగులు ఆకుకు 10 ఉంటే పంటకు అధికంగా నష్టం వాటిల్లుతుంది. తొలి దశలో రసంపీల్చే పురుగుల వల్ల అధికంగా నష్టం వాటిల్లుతుంది. అలాంటి పైర్లకు కాండం పూత అవసరం. పైరు 20, 40, 60 రోజులకు కాండం పూత ఆచరించాలి. ఒక పాలు మోనోక్రొటోఫాస్ లేదా మిథైల్ డెమటాన్, నాలుగు పాళ్లు నీరు లేదా ఒక పాలు ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్.ఎల్, 20 పాళ్లు నీరు కలిపిన ద్రావణాన్ని మొక్కల లేత కాండంపై పూత పూయాలి. అవసరాన్ని బట్టి లీటరు నీటికి మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లీటరు నీటికి వంతున కలిపి పిచికారి చేయాలి.



మొక్క కాండంపై పిండినల్లులు

★ పిండి పురుగులు లేత ఆకులు, కొమ్మల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఇవి ఆకులపై విసర్జించిన పదార్థంపై మసి తెగులు వ్యాపించి మొక్కలు వడలిపోతాయి. ఈ పురుగుల నివారణకు గట్లపైన, అడవి బెండ, పార్థీనియం, చిలుకముక్కుఆకు వంటి కలుపు మొక్కలను తొలగించాలి. పిండి పురుగులు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. పురుగుల విసర్జితాలపై నల్ల చీమలు ఆశిస్తాయి. చీమల ఉనికి ఆధారంగా పిండి పురుగులు ఆశించినట్లు సులభంగా గుర్తించవచ్చు. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మిథైల్ పెరాథియన్ 2 మి.లీ. లేదా ట్రయిజోఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు + 0.5 మి.లీ శాండోవిట్, లీటరు నీటికి వంతున కలిపి చేతిపంపుతో పిచికారి చేయాలి.



పేనుబంక ఆశించిన మొక్క

★ అధికంగా బీటీ రకాలనే సాగు చేసినందున రసంపీల్చే పురుగులు మినహా మిగతా చీడపీడల ఉధృతి తక్కువగానే ఉంది. 10 కిలోల వేపగింజల పొడిని రాత్రంతా నీటిలో నానబెట్టి మరుసటి రోజు దీని కషాయాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులు పైరు దరిచేరవు.

దిగుబడి పెంచే చర్యలు

★ పైరు 90-100 రోజుల వయసులో మొక్కల లేత చిగుర్లను తుంచి వెయ్యాలి. దీనివల్ల పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూత, కాత అధికంగా వస్తుంది. చిగుర్లపై పెట్టిన శనగపచ్చ పురుగుల గుడ్లు నశించి పైరుపై పురుగుల ఉధృతి తగ్గుతుంది. పత్తిలో కంచె పంటలు, ఆకర్షక పంటలు, అంతర పంటల సాగుతో పురుగులను చాలా వరకు అరికట్టవచ్చు.

★ చాలా మంది రైతులు ప్రస్తుతం భాస్వరం, కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేస్తున్నారు. భాస్వరాన్ని దుక్కిలోనే వేయాలి. పైపాటుగా భాస్వరాన్ని వేస్తే ఎరువు వృథా అవుతుంది. ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను మాత్రమే పైపాటుగా వేయాలి. యూరియాతో కలిసి ఉన్న పొటాష్‌ను కూడా ఎరువులో పోషకాల మోతాదును సరిచూసి పంటకు పైపాటుగా వేయవచ్చు.

– న్యూస్‌టుడే, కుంటాల